ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జిల్లా రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రార్‌గా రెడ్డి సత్యనారాయణ నియమితులయ్యారు. జిల్లా రిజిస్ట్రార్లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిలో భాగంగా ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు.రెడ్డి సత్యనారాయణకు గతంలో ఈ జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.



దారి కాసిందా అంతే : జాతీయ రహదారి పక్కన దట్టంగా ఉన్న ఈ రిజర్వు ఫారెస్టులోనే పులి సంచారం.. అయినా కానరాని హెచ్చరిక బోర్డులు.. లైట్లు

భయం..భయం!

అటవీ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం

చుట్టూ నగరం..మధ్యలో జాతీయ రహదారిని ఆనుకుని అడవి.. ఆ అడవిలో ఒక చిరుత పులి.. ఎక్కడ నుంచి ఎలా వచ్చిందో తెలియదు.. 13 రోజులైంది.. ఎటుందో.. ఎటెళ్లుతుందో తెలియదు.. అంతా అయోమయం.. అధికారులు పట్టుకుంటామనడం తప్ప.. కనీస రక్షణ చర్యల్లేవ్.. అడవిని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై కనీసం లైట్లు లేవు.. రాత్రయిందంటే అంతా చీకటే.. ఏం జరిగినా ఇక అంతే.. చిరుత పులి ఉంది జాగ్రత్త అనే హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేశారా అంటే అదీలేదు..నగరంలోనే ఉన్న పర్యాటక శాఖ మంత్రయినా పట్టించుకుంటారా అంటే అదీలేదు.. జిల్లా కేంద్రం చెంతనే ఉన్నా కలెక్టర్ మాట్లాడడం లేదు.. ఎమ్మెల్యేలు నోరు మెదపడంలేదు.. ప్రజల ప్రాణాలను చిరుత పులికి వదిలేసి చోద్యం చూస్తున్నారు.. ఈ కాస్త నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాల మీదకు తెచ్చేలా ఉంది.!?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అటవీ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.. రిజర్వు ఫారెస్టులోని చిరుతను తక్కువ అంచ నా వేస్తున్నారు.. కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా ప్రజలను భయంలోకి నెట్టేస్తున్నారు..ఎవరి మీదనైనా దాడి చేస్తేనే కానీ రక్షణ చర్యలు చేపట్టేలా కనిపించడంలేదు. రిజర్వు ఫారెస్టు జనావాసం మధ్యన ఉండడంతో జనం మాత్రం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బయటకు రావాలంటేనే గజగజ వణికిపోతున్నారు. అటవీ అధికారులు మాత్రం ప్రతి రోజూ ప్రకటనలకే పరిమితమైపోతున్నారు. చిరుత సంచరిస్తున్నట్టు ఈ నెల 6న తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచీ రాజమహేంద్రవరం శివారు లాలాచెరువు నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా 532.18 హెక్టార్లలో ఉన్న అభయారణ్యంలో సంచరిస్తోంది. ఈ అడవిని ఆనుకునే శ్రీరాంపురం, దివాన్ చెరువు, లాలా చెరువు, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాలు ఉన్నాయి. రిజర్వు ఫారెస్టు చుట్టూ ఉన్న ప్రజలు బయటకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం రాజమహేంద్రవరం వచ్చేవారు.. రాజమహేంద్రవరం వైపు నుంచి దివాన్‌చెరువు వైపు వచ్చేవారు ప్రాణాలు అరచేత పట్టుకుంటున్నారు. ఒకవేళ చీకటి పడితే కంగారుపడుతున్నారు. ఇంటికి వెళ్లే దారిలో ఏదైనా చప్పుడు అయితే గుండెలు గుభేల్ మంటున్నాయి. మేకలు, గొర్రెలు, గేదెలను పగటి వేళల్లో మేత కోసం గ్రామాల శివారుల్లోకి తోలుకెళతారు. చిరుత భయంతో వాటికి సరైన గ్రాసం కరువైంది. ఇళ్ల, మకాంల దగ్గర కట్టేసిన సమయంలో ఏదైనా అలజడి జరిగితే అక్కడ ఉన్న వాళ్లకు పై ప్రాణం పైనే పోయినంత పనవుతోంది. నగరంలోకి చదువు కోసం వస్తున్న పిల్లలు ఇంటికి వచ్చే వరకూ టెన్షన్‌తో ఎదురు చూస్తున్నారు. సీతాఫలాల సీజన్ కావడంతో రైతులు తోటలకు వెళ్లేం దుకు తటపటాయిస్తున్నారు.

అయోమయం.. వెన్నాడుతున్న భయం

జాతీయ రహదారికి అటు ఇటు.. అంటే అటవీ శిక్షణా కేంద్రం, శ్రీరాంపురం వైపు.. హౌసింగ్ బోర్డు, ఆటోనగర్ వైపు అభయారణ్యం విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో ముందు 50 ట్రాప్ కెమెరాలు పెట్టి తర్వాత ఆ సంఖ్యను 73కు పెంచారు. మూడు రోజుల కిందట వరకూ చిరుత ఏదోక ట్రాప్ కెమెరాలో చిక్కింది. కానీ ఆయా ప్రాంతాలు ఏ జనావాసాలకు దగ్గర ఉన్నాయో కూడా వెల్లడి కాలేదు. అటవీ శిక్షణ కేంద్రం వెనుక భాగంలో ఉన్న అటవీ ప్రాంతంలో పందులు, కుక్కలు, కోతులు ఎక్కువ. ఆహారం సమృద్ధిగా దొరుకుతుండడంతో ఇక్కడే పులి సంచరిస్తుందని అందరూ భావించారు. కానీ మంగళవారం అటవీ శాఖ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పుష్కరవనం వైపు నుంచి అటవీ శిక్షణ కేంద్రం వైపు వచ్చిందని చెప్పడంతో అంతా అవాక్కయ్యారు. పులి కనబడిన ప్రాంతాన్ని అటవీ శాఖ అధికారులు స్పష్టంగా వెల్లడిస్తే ఆయా ప్రాంతాల నివాసులు అప్రమత్తమయ్యే అవకాశం ఉంది. కానీ పులి ఫోటోకు చిక్కింది.. ఈ రోజు కనబడలేదు.. హైవే దాటింది.. అంటూ ముక్తసరి మొక్కుబడి ప్రకటనలతో అయోమయం నెలకొని భయపడుతూ బతికే పరిస్థితి దాపురించింది.

హైవేలో లైటింగ్ పెట్టకూడదా?

లాలాచెరువు నుంచి దివాన్ చెరువు జీరో పాయింట్ వరకూ. అటవీ శిక్షణా కేంద్రం ప్రాంతంలో పులి సంచారం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఆ పరిధిలో ఉండే జాతీయ రహదారి ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. పగలు, రాత్రి వేళల్లో కూడా ఈ ప్రాంతంలో వాహనదారులు సేదతీరడానికి, మలమూత్ర విసర్జనలకు ఆగుతుంటారు.పగటిపూట పండ్లు, కూరగాయలు విక్రయిస్తుంటారు. అయినా లాలాచెరువు నుంచి దివాన్ చెరువు వరకూ కనీస రక్షణ చర్యలు చేపట్టలేదు. రిజర్వు ఫారెస్టు కావడంతో రాత్రయితే ఆ ప్రాంత మంతా చీకటిమయం. కనీసం లైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో అటు పులితో పాటు ఇటు వాహనదారులకు ప్రమాదమే. పులి సంచరిస్తోంది..ఇక్కడ ఆగవద్దు లాంటి ముందస్తు హెచ్చరిక బోర్డు ఒకటీ లేదు. ఆయా ప్రాంతాల ప్రజలకు జాగ్రత్తలు చెబుతున్నారు.కానీ ఎక్కడి నుంచో వచ్చే వాహనదారులకు చిరుత పులికథ ఎలా తెలుస్తుందనే మీమాంస నెలకొంది. ఇక్కడ కీలకమైన విషయం మరొకటి ఉంది. ఇటు వన్యప్రాణి అయిన పులికి ఏదైనా అపాయం జరిగినా ఇబ్బందే.. అటు ప్రజలకు ఏదైనా హాని జరిగినా సమస్యే!? దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

- జనారణ్యంలో చిరుత పులి
- కానరాని కనీస రక్షణ చర్యలు
- లైట్లూ లేవు.. బోర్డులు లేవు
- నాయకులు..కలెక్టర్‌కూ పట్టదు
- ఆందోళనలో ప్రజానీకం
- ప్రకటనలకే అటవీ శాఖ పరిమితం

నాయకులకూ పట్టదా..?

13 రోజులు.. 73 కెమెరాలు.. 8 జోన్లు.. 9 బృందాలు.. 50 మందికిపైగా అటవీ సిబ్బంది.. డ్రోన్ కెమెరా.. రోజూ ప్రకటనలు.. చిరుత మాత్రం చిక్కడం లేదు. యంత్రాంగం పనితీరు ఎలా ఉన్నా ఆయా ప్రాంతాల జనం మాత్రం హడలిపోతున్నారు. పగటిపూట బయటకు రావాలన్నా దడదడలాడుతున్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇక్కడే ఉన్నారు. అటవీ శాఖను సాక్షాత్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చూస్తున్నారు. అయినా చిరుతను పట్టుకునే విషయంలో యంత్రాంగం పట్టు తప్పుతూనే ఉంది. జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరం లోనే చిరుత సంచారం ఉన్నా కలెక్టర్ కూడా పెద్దగా పట్టించుకున్నట్టు లేదనే విమర్శలున్నాయి. ఇక పులి సంచరిస్తున్న ప్రాంతాల పరిధి నియోజకవర్గాలైన రాజానగరం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, సిటీ ఎమ్మెల్యేలు పెద్దగా పట్టనట్టు ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. విషయం తీవ్రమైతే అప్పుడు చూద్దామనే ధోరణిలో ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా బుధవారం డీఎఫ్‌వో ఎస్.భరణి బుధవారం దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే చిరుతపులి సంచరిస్తోందని మరో ప్రకటన విడుదల చేశారు. రక్షణ చర్యలపై డీఎఫ్‌వోను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

నిత్యావసర ధరలపై దృష్టి పెట్టాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 : నిత్యావసర ధరల నియంత్రణకు అధికారయంత్రాంగం తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ధరల పర్యవేక్షణ, స్థిరీకరణ, నియంత్రణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ధరల నియంత్రణకు ఏర్పాటైన కమిటీ తగిన సిఫార్సులు చేయాలన్నారు. జిల్లాలో ఏయే సీజన్లలో ఏయే కూరగాయలు పండిస్తున్నారు, దిగుబడి ఎంత వస్తున్నదీ అనే వివరాల నెలవారీ గణాంకాలను కచ్చితంగా సేకరించి అధ్యయనం చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా నిత్యావసర ధరలపై దృష్టి పెట్టాలన్నారు. దళారుల ప్రమేయాన్ని నియంత్రించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఆర్డీఓ కేఎల్ శివజ్యోతి, జిల్లా పౌరసరఫరాల అధికారి విజయభాస్కర్, డీఎంసీ రాధిక, జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్, కమిటీ సభ్యులు, ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపార ప్రతినిధులు, ధరల నియంత్రణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ స్వచ్ఛత హీ సేవ ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18: సమాజం పరిశుభ్రంగా ఉంటేనే అభివృద్ధి ఆరోగ్యం సాధ్యమవుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం వైజంక్షన్ నుంచి నందంగనిరాజు సెంటర్ వరకు బుధవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ చేశారు. జెండా ఊపి ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో అందరూ బాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి వి వెంకట్రాజు, ఉప విద్యాశాఖ అధికారి ఇవిబి యన్ నారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై డయల్ 18004254156

రాజానగరం, సెప్టెంబరు 18 : బాల్య వివాహాలు నేరం అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.క్రాంతిలాల్ అన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, క్రాఫ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరిగినట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100కి జిల్లా మేజిస్ట్రేట్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004254156కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ బి.రాజ్‌కుమార్, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, సీడీపీవో టి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు కమిషనర్‌గా నాగేంద్ర కుమార్



కొవ్వూరు, సెప్టెంబరు 18 : కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా టి.నాగేంద్రకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కొవ్వూరు కమిషనర్‌గా పనిచేసిన కె.డానియేల్ జోసఫ్ కనిగిరి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీఅయ్యారు. పలాస మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న నాగేంద్రకుమార్ కొవ్వూరు వచ్చారు. మునిసిపల్ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మునిసిపల్ మేనేజర్‌గా పి.సాయిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మేనేజర్‌గా పనిచేసిన జి.రాధాకృష్ణ కోనసీమ జిల్లా రామచంద్రపురం మునిసిపాలిటీకి రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా బదిలీ అయ్యారు. పిఠాపురం మునిసిపాలిటీ నుంచి సాయిబాబు కొవ్వూరు వచ్చారు. కొవ్వూరు మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.వి.వి.రమణ బదిలీపై భీమవరం వెళ్లారు.

వరద బాధితులకు రూ.83,44,624



స్పందించిన చేతులు : విజయవాడలో బుధవారం సీఎం చంద్రబాబు నాయుడికి రూ.83.44, 624ల చెక్ అందజేస్తున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, తదితర నాయకులు

కడియం, సెప్టెంబరు 18 : దాతలు స్పందిస్తున్నారు.. మేం ఉన్నాం అంటూ ముందుకొస్తున్నారు.సాయం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్లబుచ్చయ్యచౌదరి తన నియోజకవర్గ పరిధిలో కూటమి నాయకులు, పలు రంగాలకు చెందిన ప్రతినిధులు నుంచి స్వచ్ఛందంగా రూ. 83,44,624 సేకరించారు. నిధులు ఇచ్చిన నాయకులు, ప్రతినిధులతో కలిసి ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే గోరంట్ల విజయవాడలో బుధవారం సీఎం చంద్రబాబుకు అందించారు. విజయవాడ బుడమేరు వరద బాధితులకు సహాయం అందించిన రూరల్ నియోజకవర్గ కమిటీలు, వివిధ రంగాల ప్రతినిధులను ఏకం చేసి నిధులు సేకరించిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్లను సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు.



ఎస్‌కేవీటీ మహిళా కళాశాల రోడ్‌లో డ్రెయినేజీలపై ఆక్రమణలు

చినుకుపడితే.. మునకే!?

బుడమేరు ఘటనతో ఆందోళన

బుడమేరు పొంగింది.. విజయవాడ నగరం ముంపులో చిక్కుకుంది..ఈ కష్టానికి కారణమెవరా ఆరా తీస్తే.. ఇంకెవరు అక్రమార్కులు అని తేలిం ది.. వాళ్లెవరంటారా.. కరకట్టలు కొట్టేసినవారు.. డ్రైనేజీలు ఆక్రమించేసిన వారు.. నగరంలో ఆక్రమణలే నేడు ఈ పరిస్థితికి తెచ్చాయి.. మరి మన తూర్పుగోదావరి జిల్లాలో జిల్లా కేంద్రం పరిస్థితేం టో ఒకసారి చూద్దామా.. రాజమహేంద్రవరంలో గంట చినుకుపడితే చాలు నగరం గోదారిలా మారిపోతోంది.. ఇక కొవ్వూరు, నిడదవోలు ముని సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. ఎందుకంటే... ఎక్కడ చూసినా డ్రెయినేజీల ఆక్రమణలే..

- రాజమహేంద్రిలో భయంభయం
- గంట వానపడితే నగరం గోదారే
- కొవ్వూరు..నిడదవోలులోనూ ఇంతే
- అడ్డగోలుగా డ్రైనేజీలు, కాలువల ఆక్రమణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18 : రోజురోజుకు విస్తరిస్తున్న నగరం రాజమహేంద్రవరం..ఈ నగరంలో అన్ని ప్రధాన రహదారులకు అనుసంధానంగా సుమారు 600 కిలోమీటర్ల పైబడి డ్రైనేజీ వ్యవస్థ ఉంది. నిత్యం చిన్నపాటి డ్రైనేజీల గుండా మురుగునీరు ప్రవహిస్తుంది. సుమారు 70 వేల గృహాలు, 20 వేల వ్యాపార సంస్థలు కలిగిన నగరంలో అనునిత్యం లక్షల లీటర్లు వాడిన నీరు ఇళ్ల గుండా డ్రైనేజీల్లోకి చేరి అక్కడ నుంచి కొన్ని కూడళ్లలో ఉన్న ప్రధాన డ్రైనేజీలకు కనెక్ట్ అక్కడ నుంచి నీరు దిగువకు చేరి స్టోరేజ్ ట్యాంకుల్లోకి వెళ్లడం లేదా నేరుగా నల్లచానల్ గుండా గోదావరిలోకి వెళ్లిపోతుంది.

గంటలో నగరం మునకే..

సాధారణంగా డ్రైనేజీలు గంట పాటు బ్లాక్ అయితేనే నగరంలో చాలా ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డెక్కుతుంది. అటువంటిది వర్షాకాలంలో దీని తీవ్రత పైస్థాయిలో ఉంటుంది. వర్షాకాలం కాకపోయినా డ్రైనేజీ వాటర్ బ్లాక్ అయితేనే నగరంలో ముంపు సమస్య వస్తుంది. తుమ్మలావ, రామచంద్రరావుపేట,ఆదెమ్మదిబ్బ, కృష్ణానగర్, ఆర్యాపురం తదితర ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డెక్కేస్తుంది. దీనికి ప్రధాన కారణం ఆక్రమణలే. నగరంలో చాలా ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు,షాపింగ్ మాల్స్ నివాస గృహాలు నిర్మిస్తున్నారు. ఆయా భవనాల నిర్మాణంలో పబ్లిక్ డ్రైనేజీలనే ఆక్రమించేశారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలపై ప్రైవేట్ వ్యాపార సంస్థల నిర్వాహకు లు శ్లాబులు వేసేశారు. వాటిని అడ్డుకోవడం, తీసివేయడం వంటి పనులు కార్పొరేషన్ అధికారులు చేయకపోవడంతో చినుకు పడితే చాలు నగరం చెరువుగా మారిపోతోంది. ఒకసారి పాత డ్రైనేజీల నిర్మాణాలు పరిశీలిస్తే ఎంత ఆక్రమణలు జరి గాయో అధికారులకు అర్థమవుతుంది. టీటీడీ కల్యాణ మండపం ప్రాంతమంతా 50 ఏళ్ళ కిందట చెరువే. కానీ ఇప్పుడు ఆ చెరువులు లేవు. కొన్ని ప్రాంతాల్లో వాటర్ స్టోరేజీకి వినియోగించే స్థలాలు కబ్జాలకు గురయ్యాయి. నగరంలో భారీ వర్షం వచ్చినప్పుడు సుమారు 70 శాతం నగరం ముంపుబారిన పడుతుంది.




నగరంలోని ఒక వీధిలో ఇలా..

వైసీపీలో ఇష్టానుసారం పనులు

గత ప్రభుత్వ హయాంలో నగరంలో రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల్లో ఇంజనీరింగ్ వ్యవస్థను పక్కన పెట్టేశారు. ఫలితంగా ఇప్పుడు నగరాన్ని ముంపు సమస్య వెంటాడుతోం ది. కొన్ని ప్రాంతాల్లో రహదారులను హైట్ చేసి డ్రైనేజీలను వదిలేశారు. కొన్ని చోట్ల డ్రైనేజీలను హైట్ చేసి రహదారులను డౌన్ చేశారు. కూడ ళ్లను ఎత్తుచేసి రోడ్లను కుదించేశారు. దీంతో కూడలి గుండా వెళ్ళే వర్షపునీరు రహదారిపై నిలిచిపోతుంది. నగరంలో ఎత్తు ప్రదేశాల నుంచి వచ్చే వర్షపు నీరు నేరుగా ప్రధాన డ్రైనేజీలకు అనుసం ధానం చేయడంలో అక్కడక్కడా వైఫల్యాలు ఉన్నాయి.దీంతో చినుకుపడితే నగరం ముంపుబారిన పడిపోతుంది. రోడ్డెక్కిన నీరు డ్రైనేజీ గుండా డౌన్‌కు చేరడంలేదు. ఫలితంగా రహదారులపై చెత్తచెదారాలు నిలిచిపోయి దుర్గంధం భరితంగా మారిపోతుంది. డ్రైనేజీలపై శ్లాబులు వేసేయడం వల్ల వర్షపు నీరు మురుగునీరు పారుదల కష్టంగా మారిపోతుంది. గట్టిగా గంట వర్షంపడితేనే నగరంలో వీఎల్‌పురం మొదలుకొని ఆర్టీసీ కాంప్లెక్స్, తాడితోట, రైల్వేస్టేషన్ రోడ్డు, దేవిచౌక్, తుమ్మలోవ, రామచంద్రరావు పేట, కంబాలచెరువు హైటెక్ బస్టాండ్, వై.జంక్షన్, కోరుకొండరోడ్డు, లలితానగర్, పేపరు మిల్లు రోడ్డు తదితర ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. నగరం లో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిస్తే చాలా వరకు ముంపు సమస్యలు పరిష్కారం అవుతాయి. లేకుంటే బుడమేరు పొంగితే విజయవాడ ఎటువంటి పరిస్థి తిని ఎదుర్కొందో అంతకంటే దారుణ పరిస్థితులు రాజమహేంద్రవరం ఎదుర్కొనే అవకాశం ఉంది.

ఆక్రమణల తొలగింపునకు 3 బృందాలు
కమిషనర్ కేతన్‌గార్గ్

నగరంలో ఆక్రమణల తొలగింపునకు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ 3 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం 32వడివిజన్‌లో అజాద్ చౌక్ క్లాక్ టవర్ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు 26 చోట్ల డ్రైనేజీలపై ఆక్రమణలు, 15 రూఫ్ షెడ్లను,రెండు తోపుడు బళ్లను బుధవారం తొలగించారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారుల్లో ఉన్న అభ్యంతరకరమైన ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులపై ఉన్న మెట్లు, ర్యాంపులను తొలగిస్తున్నామని చెప్పారు.



నాట్..గుడ్డు!

సంక్షోభంలో కోళ్ల పరిశ్రమ

- పెరుగుతున్న మేత ధరలు
- గిట్టుబాటు కాని గుడ్డు ధర
- ఆందోళనలో రైతాంగం
- గత వైసీపీలో అయోమయం
- అందని ప్రభుత్వ రాయితీలు
- ఇతర రాష్ట్రాల్లో లాభసాటిగా..
- ఏపీలో పరిశ్రమ పతనం
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

అనపర్తి, సెప్టెంబరు 18 : మేతల ధరలు పెరుగుతున్నాయి.. గుడ్డు ధర చూస్తే మాత్రం పెరగదు..ఎప్పుడూ రూ.5. నుంచి రూ.6ల మధ్యనే . దీంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. మేత ధరలు తక్కువగా ఉన్న సమయంలో గుడ్డు ధర రూ.3లకు విక్రయించినా లాభసాటిగా ఉండేది. ప్రస్తుతం గుడ్డు ధర నిలకడగా ఉన్నా అదే పరిస్థితి. ఏపీలో పెరిగిన ఫీడ్, మందులు, ఇతర ఖర్చులకు కనీసం గుడ్డు ధర రూ.5.50 నుంచి రూ.6.00 వరకు పలికితే రైతులు నష్టాల భారిన పడకుండా బయటపడే పరిస్థితి ఉంది. అయితే ఈ ధర ఏడాదిలో కనీసం రెండు మూడు నెలలు కూడా ఉండడంలేదని లేదని రైతులు వాపోతున్నారు. ఏడాదంతా అన్ సీజన్‌గా మారి నష్టాల బాట పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఒరిస్సా రాష్ట్రంలో 15 లక్షలకే పరిమితమైన కోళ్ల పరిశ్రమ నేడు 1.50 కోట్ల కోళ్ళతో రోజుకు సుమారుగా 1.20 లక్షల గుడ్లు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుంది.బిహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో కూడా కోళ్ల పరిశ్రమలు పెరగడం అక్కడ గుడ్డుకు రూ.6లు పలకడంతో రైతులు కోళ్ళ సంఖ్యను పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమిళనాడులో కూడా కోళ్ళ పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. అక్కడి నుంచి కేరళ, కర్నాటక రాష్ట్రాలకు గుడ్ల సరఫరా జరుగుతుండడంతో పరిశ్రమ ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది. ఒకప్పుడు కోళ్ళ పరిశ్రమకు పెట్టింది పేరుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం అయోమయస్థితిలో కొట్టుమిట్టాడుతుంది. నెక్ జోన్ ప్రకటించిన రేటుకు గుడ్లుకొనే పరిస్థితి నుంచి లోడు చేరిన తరువాత అక్కడి ట్రేడర్లు రేటు నిర్ణయించే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.ఏడాదిలో మూడు నెలల సీజన్‌కు రైతులు ఎదురు చూసేవారు. నవంబరు,డిసెంబరు,జనవరి నెలల్లో గుడ్డు ధర పెరగడం ఏడాదిలో మూడు నెలల్లో వచ్చిన లాభంతో మిగిలిన నెలల్లో వచ్చిన ఒడిదుడుకులను ఎదుర్కొనే ధైర్యంతో రైతులు ఉండేవారు.ఏడాదంతా అన్‌సీజన్‌గా మారడంపై ఆందోళన చెందుతున్నారు.

మేత ధరలతో రైతుల కుదేలు

కోళ్ళ పరిశ్రమలో కోళ్ళ దాణాకు వినియోగించే నూక, మొక్కజొన్న ధరలు విపరీతంగా పెరగడంతో రైతులకు పెనుభారంగా మారాయి. క్వింటా వెయ్యి నుంచి పన్నెండు వందల వరకు లభ్యమయ్యే వీటి ధరలు ప్రస్తుతం రూ.2700 నుంచి రూ.3000 వరకు పెరిగాయి.ఈ లెక్కన ప్రస్తుతం దాణా టన్నుకు రూ.30 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. మరో పక్క కోళ్ళ మందుల ధర పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లక్ష ఉన్న ఫారాలు ప్రస్తుతం సగానికి సగం తగ్గించుకుంటూ పోవడంతో దిగుబడి తగ్గింది.కోళ్ళ సంఖ్య తగ్గించినప్పటికీ మిగిలిన నెలవారీ ఖర్చులు ఆదేస్థాయిలో ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో నష్టాలకు భయపడి అనేక మంది రైతులు కోళ్ళ సంఖ్యను తగ్గించుకుని ముందుకు సాగుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి..

కోళ్ళ పరిశ్రమను ప్రోత్సహించేందుకు అనేక రాష్ట్రాలు రైతులకు రాయితీలు ప్రకటిస్తున్నాయి. మన రాష్ట్రంలో గత ప్రభుత్వం ఐదేళ్లలో ఎటువంటి రాయితీలను ప్రకటించకపోగా అంతకు ముందున్న తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన రాయితీలను గత ప్రభుత్వం తొలగించడంతో పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. మరో వైపు విద్యుత్ చార్జీలు అధికం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లక్ష కోళ్ళు ఉన్న పరిశ్రమకు సుమారుగా నెలకు రూ.75 వేలు.. వేసవిలో రూ.లక్ష వరకు విద్యుత్ బిల్లు చెల్లించాల్సి రావడం రైతులకు భారంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వంపై కోళ్ళ రైతులు ఆశలు పెట్టుకున్నారు.కూటమి ప్రభుత్వం బ్యాంకు రు ణాలపై వడ్డీ రాయితీ, విద్యుత్ చార్జీల తగ్గింపు, మొక్కజొన్ననూకలు వంటి వాటిపై సబ్సిడీ అందించి పరిశ్రమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కూటమి సర్కారు కొరడా

- పోలవరం భూసేకరణ పరిహారంలో రూ.19.52 కోట్ల అక్రమ చెల్లింపులు గుర్తింపు
- బాధ్యులైన ఉన్నతాధికారులతో పాటు అక్రమ లబ్ధి పొందిన గిరిజనేతర రైతులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సొమ్ము మొత్తం వసూలు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టరుకు ఆదేశం

పోలవరం జాతీయ ప్రాజెక్టు కింద చేపట్టిన భూ సేకరణ పరిహారంలో రూ.19.52 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిగాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం బాధ్యులైన ఉన్నతాధికారులతో పాటు అక్రమ లబ్ధి పొందిన గిరిజనేతర రైతులపై చర్యలకు కొరడా ఝుళిపించింది. ఈ బాగోతాలకు సంబంధించి బుధవారం జీవో నెం.629, 631గా రెవెన్యూ (విజిలెన్స్) విభాగం ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం భూ సేకరణ, పునరావాస అక్రమాలపై గడచిన ఐదేళ్లలో 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే.

రంపచోడవరం, సెప్టెంబరు 18:

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం కొండమొదలు పంచాయతీలో భూములకు సంబంధించి 2019 జూలై నుంచి 2022 ఫిబ్రవరి వరకు 27 మంది అనర్హులైన గిరిజనేతర రైతులకు అప్పటి స్పెషల్ కలెక్టరు ఇ.మురళి, రాజమహేంద్రవరంలోని ఎడమ కాలువ యూనిట్-1 స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (ఇన్‌చార్జిగా ఉన్న) చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి రూ.19.52 కోట్ల మేర దఫదఫాలుగా చెల్లింపులు సాగించేశారు. ఈ అక్రమ బాగోతంపై కొన్నేళ్లుగా ఫిర్యాదులు అంది, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నుంచి నివేదికలు అంది, సంబంధిత అధికారుల నుంచి బాధ్యులపై తగు చర్యలకు సూచనలు ఉన్నా జగన్ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

కాగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై కూటమి సర్కారు దృష్టి సారించిన నేపథ్యంలో ఈ బాగోతాల ఫైలు కూడా బయటపడింది. దీంతో సదరు అంశాలను నిశితంగా పరిశీలించిన ప్రభుత్వం బాధ్యులపై తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే సదరు ఉత్తర్వులు జారీ చేసింది. దాని ప్రకారం కేవలం ఒక్క కొండమొదలులో మాత్రమే చోటుచేసుకున్న భూసేకరణ అక్రమాలను చూస్తేనే ప్రభుత్వ ఖజానాకు భూ సేకరణ అధికారులు అనర్హులైన రైతులతో కుమ్మక్కయి చేకూర్చిన నష్టాన్ని భర్తీ చేసే చర్యలను కూడా ప్రభుత్వం చేపట్టింది. రెవెన్యూ రికవరీ చట్టం కింద సదరు రూ.19.52 కోట్ల అక్రమ చెల్లింపులను ఆయా అధికారుల నుంచి, పరిహారం పొందిన గిరిజనేతర రైతుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టరును ప్రభుత్వం ఆదేశించింది.

ఇదిలా ఉండగా బాధ్యులైన అధికారులుపైన, గిరిజనేత రైతులపైన అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కూడా ఆదేశించింది. అయితే ఈ బాగోతంపై ఇప్పటికే అప్పటి అల్లూరి కలెక్టర్ సుమిత్‌గాంధీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవీపట్నం పోలీసు స్టేషన్లో క్రైం నెం.70/2022గా కేసు నమోదు కాగా అందులోసదరు అధికారులు, గిరిజనేతర రైతులు ముందస్తు బెయిలు పొందారు. ఇది ఇంకా దర్యాప్తు స్థాయిలోనే మిగిలిపోయింది. అయితే ఇపుడు అవినీతి నిరోధక చట్టం కింద చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అల్లూరి జిల్లా కలెక్టరును ఆదేశించడంతో ఇప్పటికే నమోదై ఉన్న కేసును ఏసీబీకి బదిలీ చేయడం అనివార్యమవుతోంది. ఈ వ్యవహారమే కాకుండా ఇంకా అనేక అక్రమ వ్యవహారాలు వందల కోట్ల రూపాయల మేర చోటుచేసుకున్న విషయం కూడా ప్రభుత్వ పెద్దల వద్ద పెండింగులో ఉంది. ముఖ్యంగా పోలవరం జాతీయ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వానిది కావడంతో ఇక్కడ జరిగే అక్రమాలు కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ ద్వారా జరిపించాల్సి వస్తుందన్న వాదనలు కూడా అధికార వర్గాల్లో వినిపిస్తున్నాయి.



విజిలెన్స్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

రంప మన్యంలో రూ.వెయ్యి కోట్ల పనులపై
విచారణ జరపండి

విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు రంపచోడవరం ఎమ్మెల్యే వినతి

రంపచోడవరం, సెప్టెంబరు 18: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ కోరుతూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మొత్తంగా సుమారు వెయ్యి కోట్ల రూపాయల మేర జరిగిన పనుల్లో నాణ్యతా లోపాలు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టడం, లబ్ధిదారుల ప్రయోజనాలను దెబ్బతీయడం వంటి అనేక లోపభూయిష్ట అంశాలను ఎత్తిచూపి ఎమ్మెల్యే ఇక్కడి పరిస్థితులను డైరెక్టర్ జనరల్‌కు వివరించారు. ముఖ్యంగా రూ.139.75 కోట్లతో సీసీ రోడ్లు, రూ.135 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు, రూ.36.64 కోట్లతో నాడు-నేడు పనులు.... వీటికి అదనంగా పోలవరం ప్రాజెక్టు కింద దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాల నిర్వాసితులకు పునరావాసం కల్పించని వ్యవహారాలు, పునరావాస కాలనీల నిర్మాణం, రోడ్ల పనులు, భూముల కొనుగోలు తదితర అంశాలను ఎమ్మెల్యే వివరించారు.

దేవీ ఫిషరీస్‌లో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్

నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 18: ఫుడ్ ఇండియా-2024 పేరిట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ గురువారం వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా పలు పరిశ్రమలను ప్రారంభించబోతున్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం సీతానగరంలో దేవీ ఫిషరీస్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేసిన కొత్త రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. ఇది తమ కృషికి లభించిన గుర్తింపు అని కంపెనీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

నేడు, రేపు మహిళా కమిషన్
చైర్‌పర్సన్ పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఈ నెల 19, 20 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యటిస్తారని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారిణి కె.విజయకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీడబ్ల్యు ఆదేశానుసారం రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. పర్యటనలో భాగంగా ఆమె సెంట్రల్ జైలులోని ప్రత్యేక మహిళా జైలును సందర్శిస్తారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మహిళల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. బాధిత మహిళల ఫిర్యాదులు స్వీకరించడానికి గురువారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు, శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు అందుబాటులో ఉంటారు.



లైంగిక వేధింపులపై
గిరిజన సంక్షేమ శాఖ నిర్లక్ష్యం

- ఘటన తెలిసి కూడా ఫిర్యాదు చేయని సంక్షేమాధికారి, పాఠశాల నిర్వాహకులు
- బాధిత విద్యార్థి నుంచి అందిన ఫిర్యాదునే కేసుగా నమోదు చేసిన పోలీసులు
- తొలుత పాలనా కారణాలతో హెచ్‌ఎంకు డిప్యూటేషన్‌తో సరిపెట్టిన వైనం

రంపచోడవరం, సెప్టెంబరు 18: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఓ ఆశ్రమ పాఠశాలలో లైంగిక వేధింపులపై మీడియాలో కథనాలు వచ్చే వరకు గిరిజన సంక్షేమ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శించింది. బాలల లైంగిక వేధింపుల ఘటన ఎప్పటికీ వెలుగులోకి రాదనుకున్నారో ఏమో గానీ... తీవ్రంగా తీసుకోని పాఠశాల నిర్వాహకులు, అడ్డతీగల సహాయ గిరిజన సంక్షేమాధికారి వైఖరి ఏకంగా గిరిజన సంక్షేమ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసింది. ఈ నెల 6వ తేదీ వరకు జరిగిన లైంగిక దాడుల పరంపరపై బాధిత విద్యార్థినులు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు. తహసీల్దారుకు, ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు, ఏటీడబ్ల్యువో దృష్టికి చేరినా తీవ్రంగా పరిగణించకుండా కేవలం నోటి మాటతో ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సదరు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న హెచ్‌ఎంను అక్కడి నుంచి మార్చితే చాలని సూచించారు. దీంతో ఘటన తీవ్రత తెలియని అధికారులు సదరు కామాంధ ప్రధానోపాధ్యాయుడిని ఈ నెల 12న పాలనా కారణాలతో మాత్రమే డిప్యుటేషన్‌పై మంగంపాడు పంపించారు. అయితే అధికారులు ఊహించని రీతిలో లైంగిక వేధింపులపై మీడియాలో కథనాలు వచ్చాయి. ఓ మేజిస్ట్రేట్ దృష్టికి కూడా ఈ అంశం వెళ్లడం, గిరిజన సంఘాలు ఉద్యమాలకు సిద్ధమవుతున్నాయని గ్రహించడం వంటి కారణాలతో ఉన్నతాధికారులు స్పందించక తప్పలేదు. ఈ నేపథ్యంలో అల్లూరి జిల్లా కలెక్టరు ఆదేశాలతో సదరు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణను సస్పెండ్ చేశారు. ఇంత జరిగాకా కూడా బాధిత విద్యార్థినులకు అండగా నిలిచి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సదరు విద్యాలయంలో కానీ, గిరిజన సంక్షేమ శాఖలో కానీ ఎవరూ ముందుకు రాకపోవడం శోచనీయం. మీడియా కథనాలపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పోలీసులను పంపారు. విద్యాలయంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కానీ, వార్డెన్ కానీ, గిరిజన సంక్షేమాధికారి కానీ ఎటువంటి ఘటనా జరగనట్టే వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాధిత విద్యార్థిని నుంచే ఫిర్యాదు తీసుకుని పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. లోతుగా దర్యాప్తు చేస్తే ఘటనను దాచిపెట్టినందుకు, సకాలంలో ఫిర్యాదు చేయనందుకు విద్యాలయ నిర్వాహకులు, సంక్షేమాధికారులు కూడా పోక్సో చట్టం కింద నిందితులవుతారని ఆదివాసీ సంఘాల నాయకులు చెప్తున్నారు.

విచారణాధికారిగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ

గంగవరం ఆశ్రమ పాఠశాలలో లైంగిక వేధింపుల ఘటనపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలతో విచారణాధికారిగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీని నియమించినట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం బుధవారం మీడియాకు తెలిపారు. ఇప్పటికే ఈ ఘటనపై జరిగిన ప్రాథమిక విచారణ అనంతరం బాధ్యుడైన ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణను సస్పెండ్ చేశామన్నారు. గిరిజన విద్యాలయాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఇతరలెవరి నుంచి ఎటువంటి ఇబ్బంది కలిగినా ఉపేక్షించేది లేదని ప్రాజెక్టు అధికారి హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాపై కసరత్తు

ఇప్పటివరకు 13,782 దరఖాస్తుల స్వీకరణ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 18: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా రూప కల్పనకు కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి ఈ నెల 3వ తేదీ వరకు 13,782 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం బుధవారం వాటిని కాకినాడ కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్ వాటిని పరిశీలిస్తున్నారు. ఈ నెల 24వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నారు. నవంబరు 6న తుది జాబితా విడుదల చేస్తారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు
24 వరకు పొడిగింపు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 18: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తును ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో గత నెల 5వ తేదీ నుంచి అందుబాటులో ఉంచామన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈవో కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ చూడాలని లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



ఎంపికలు నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి పోటీలకు
స్కూల్ గేమ్స్ ఎంపికలు

కాకినాడ అర్బన్, సెప్టెంబరు 18: వివిధ ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పాల్గొనడానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు పలు జట్ల ఎంపికలను బుధవారం కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ డీఈవో రమేష్ ప్రారంభించారు. అండర్-17 విభాగంలో ఫుట్‌బాల్ పాటు అండర్-14, 17 విభాగాల్లో జూడో, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్‌తక్రా ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి లంక జార్జి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జేఎస్టీయూ క్రీడా కార్యదర్శి శ్యామ్‌కుమార్, కె.కుమార్, వి.రవిరాజు, కె.నూకరాజు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు 'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

తుని రూరల్, సెప్టెంబరు 18: సీబీఎస్ఈ కబడ్డీ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు సీబీఎస్ఈ బోర్డు గద్వాల్‌లో నిర్వహించిన క్లస్టర్-7 (ఆంధ్రా, తెలంగాణ) పోటీల్లో బాలుర విభాగం అండర్-14లో శివాజీ బృందం, అండర్-19లో (ఎం.గణేష్, శివ, సాయిరాం బృందం) ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించారు. ఉత్తర ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌కేవీ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్ లక్ష్మణ్, చిన్నరాజు తదితరులు అభినందించారు.



హత్యకు గురైన గంటా రాజు

వ్యక్తి దారుణ హత్య

కోటనందూరు, సెప్టెంబరు 18: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం భీమవరపుకోట శివారు తలుపులమ్మ తల్లి గుడి సమీపంలో బుధవారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అతడిని అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని శివపురానికి చెందిన గంటా రాజు (35)గా పోలీసులు నిర్ధారించారు. పథకం ప్రకారం హత్య చేసినట్టు భావిస్తున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న గంటా రాజును ఈ ప్రాంతానికి తీసుకువచ్చి మెడపై కత్తితో వేటు వేసి అతి దారుణంగా చంపారు. వీఆర్వో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు తుని రూరల్ సీఐ చెన్నకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ పరిశీలించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.



ఓ వీధిలో వెలుగుతున్న ఎల్ఈడీ దీపం

గొల్లప్రోలు వీధుల్లో విద్యుత్
వెలుగులు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో 450 ఎల్ఈడీ దీపాల కొనుగోలు

గొల్లప్రోలు, సెప్టెంబరు 18: అంధకారంలో చిక్కుకున్న కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో ఎట్టకేలకు బుధవారం వీధి దీపాలు వెలిగాయి. పట్టణంలోని వీధి దీపాలు మరమ్మతులకు గురికావడంతో ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో లైట్లు కొంతకాలంగా వెలగట్లేదు. రాత్రివేళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న సమాచారంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. తక్షణం కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 450 ఎల్ఈడీ లైట్లు కొనుగోలుకు కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు. జనసేన నాయకుడు కదారి తమ్మయ్యనాయుడు చొరవ తీసుకోవడంతో అతి తక్కువ ధరకు (గతంలో కంటే 50శాతానికి తక్కువగా) ఎల్ఈడీ వీధి దీపాలను అందించడంతో పాటు బిగించే ఏర్పాటు చేయడానికి బెస్ట్ ప్రొడక్ట్ నిర్వాహకులు ముందుకు వచ్చారు. మంగళవారం ఎల్ఈడీ వీధి దీపాలు నగర పంచాయతీ కార్యాలయానికి చేరగా బుధవారం ఏర్పాటు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను నగర పంచాయతీ కమిషనరు రవికుమార్ ప్రారంభించగా జనసేన నాయకులు పాల్గొన్నారు.



వీధి దీపాల ఏర్పాటును ప్రారంభిస్తున్న నగర పంచాయతీ కమిషనరు రవికుమార్

లక్ష్మీగణపతి నవరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.4.49 లక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 18: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను దేవదాయశాఖ తనిఖీ అధికారి (రామచంద్రపురం) ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం తెరిచి లెక్కించారు. గత నెల 28 నుంచి ఈ నెల 18 వరకు రూ.4,49,350 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీనివాస్, ఆలయ సిబ్బంది ప్రసాద్, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం



వివరాలు వెల్లడిస్తున్న చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

100 కిలోల గంజాయి స్వాధీనం

చింతూరు, సెప్టెంబరు 18: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన స్వప్నిల్‌రాతీలాల్‌కోలీ, ఆకాష్ విలాస్ చవాన్ ఒడిశాలోని కుర్మనూర్‌లో 100 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. చింతూరు మీదుగా మహారాష్ట్రకు కారులో తరలించే యత్నం చేశారు. చింతూరు పోలీసు స్టేషన్ ఎదుట వాహన తనిఖీల్లో గంజాయి పట్టుబడింది. నిందితులతో పాటు 100 కిలోల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 18: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ శివారున అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన సిద్ధాంతి శ్రీను జగ్గంపేటలోని బంధువుల ఇంటికి మోటారు సైకిలుపై బయల్దేరాడు. మార్గ మధ్యంలో రామవరం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైవే సిబ్బంది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

వేంకటేశ్వరస్వామికి మూడు కిలోల వెండి కవచం బహూకరణ



అంతర్వేది, సెప్టెంబరు 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉపాలయమైన శ్రీవేంకటేశ్వరస్వామికి సఖినేటిపల్లిపాలేనికి చెందిన దంతులూరి కుమారవరప్రసాద్ వెంకటసత్యనారాయణరాజు, కుటుంబ సభ్యులు మూడు కిలోల 400 గ్రాముల రాళ్లతో రూ.3.50 లక్షలు విలువైన సంపూర్ణ వెండి కవచాన్ని బహూకరించారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ అనంతరం దానిని వేంకటేశ్వరస్వామికి అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ అందించారు.

నన్నయ విశ్వవిద్యాలయంలో పీజీ రెండో సంవత్సరం (లేటరల్ ఎంట్రీ)
ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 18: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో వివిధ కోర్సుల కోసం రెండో సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ (లేటరల్ ఎంట్రీ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నాలుగు సంవత్సరాల యూజీ ఆనర్స్ డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థి 3, 4 సెమిస్టర్లలో పరిశోధనతో లేదా 3వ సెమిస్టర్‌లో మాత్రమే కోర్స్ వర్క్, 4వ సెమిస్టర్‌లో ప్రాజెక్టు వర్క్‌తో రెండు సంవత్సరాల పీజీ ప్రోగ్రాంలో 2వ సంవత్సరం/3వ సెమిస్టర్‌లో లేటర్ ప్రవేశానికి అర్హులన్నారు. విశ్వవిద్యాలయంతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ పీజీ కళాశాలల్లో మంజూరైన 20 శాతం సూపర్ న్యూమరరీ సీట్ల విభాగాలు/కళాశాల వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచామన్నారు. ఈ నెల 19నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. నాలుగు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు సూచించిన నిబంధనలు పాటిస్తూ పీజీ లేటరల్ ఎంట్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

నేడు ఎంపీ పురందేశ్వరి కార్యక్రమాలు ఇవే

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 : రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి గురువారం రాజమహేంద్రవరం, కొవ్వూరులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం పదిన్నర గంటలకు రాజమహేంద్రవరం గోదావరిగట్టు దగ్గర సినీ హాస్య నట చక్రవర్తి రేలంగి వెంకట రామయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నటరాజ్, జయరాం థియేటర్ రోడ్డులోని అంబేడ్కర్ వెల్ఫేర్ కమ్యూనిటీ హాలులో జరిగే సత్కార కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం కొవ్వూరు నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారని ఎంపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఏజెన్సీ సమాచారం

'నాణ్యత కలిగిన వస్తువులనే విక్రయించాలి'


చింతూరు వారాంతపు సంతను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు, సెప్టెంబరు 18: ప్రతి బుధవారం చింతూరులో జరిగే సంతలో నాణ్యత కలిగి ఉన్న వస్తువులనే విక్రయించాలని ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదేశించారు. బుధవారం ఆయన వారాంతపు సంతలో పర్యటించి విక్రయిస్తున్న వస్తువుల నాణ్యతను పరిశీలించారు. నాణ్యత ఉన్న వస్తువులనే విక్రయించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం పీవో ఆర్టీసీ బస్టాండ్‌ని పరిశీలించి పేరుకుపోయిన చెత్తతోపాటు, చెట్ల పొదలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. బస్టాండ్ ఆవరణలో దుకాణ సముదాయాలను నిర్మించి వ్యాపార కూడలిగా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో రంపచోడవరం సబ్‌కలెక్టర్ పర్యటన


నిర్వాసితులతో మాట్లాడుతున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

దేవీపట్నం, సెప్టెంబరు 18: మండలంలోని బియ్యంపల్లి, తాళ్ళూరు పునరావాస కాలనీల్లో బుధవారం రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ పర్యటించారు. కాలనీల్లో సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గోకవరంలో దేవీపట్నం గ్రామ పునరావాస కాలనీలో పర్యటించారు. మధ్యలో నిలిచిపోయిన పునరావాస కాలనీ పనులను ఆమె గుర్తించారు. కాలనీ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో రత్నకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడి ఔదార్యం

కూనవరం, సెప్టెంబరు 18: కూనవరం మండలం కాచవరం గ్రామానికి చెందిన మహిళ ములకలపల్లి వెంకటరమణ సెకిల్ సెల్ ఏనేమియా వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం రెనోవా సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌లో చేరారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌ను సంప్రదించగా రూ.10వేలు అందించినట్టు వారు తెలిపారు. ఆర్థికసాయం అందించిన జమాల్ ఖాన్‌కు రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రిలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

కూనవరం, సెప్టెంబర్ 18: మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంతో పాటు ఆసుపత్రి పరిసరాల్లోని చెత్త, ముళ్లపొదలను శుభ్రం చేశారు. ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉంచేలా ప్రతి ఒక్కరూ చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వి.వివేక్‌నాయక్, సి.తేజ, గైనకాలజిస్టు పి.శ్వేత, ఫార్మసీ ఆఫీసర్ తుష్టి జోగారావు, శానిటేషన్ సూపర్‌వైజర్ కె.సాయికుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఎన్‌ఆర్‌సీ కౌన్సిలర్ కె.రమేష్, సిబ్బంది వై.అనసూర్య, శ్రావణి, బి.లక్ష్మి, రామాంజనేయులు, సుబ్బారావు, తేజ, జోగయ్య, అఖిల్, బాపిరాజు, ప్రసాద్, సతీష్, కూరం రాజు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి అన్నసమారాధన

వై.రామవరం, సెప్టెంబర్ 18: గ్రామంలో బుధవారం వాల్మీకి వీధిలోని రామాలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. వినాయకుని మహోత్సవాలను పురస్కరించుకుని వాల్మీకి వీధిలోని వినాయక చవితి ఉత్సవాల కమిటీ సభ్యులు నిర్వహించిన అన్న సమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో నెలకొల్పిన వినాయకుని విగ్రహాన్ని బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. వై.రామవరం నుంచి ట్రాక్టర్‌పై ఊరేగింపుగా దేవరమడుగుల పెద్దేరులో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

చింతూరు, సెప్టెంబరు 18: వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్న డిమాండ్‌తో బుధవారం చింతూరులో సీఐటీయు ఆధ్వర్యంలో వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, గిరిజన సంఘం నాయకుడు సీసం సురేష్ మాట్లాడారు. అనంతరం ఐటిడిఏ పిఓ అపూర్వభరత్‌కు వినతిపత్రం అందజేశారు. పొడియం లక్ష్మణ్, కనుముల మహేష్, పొడియం బాబూరావు, సోడి దుర్గారావుపాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే శిరీషాదేవి



రంపచోడవరం, సెప్టెంబరు 18: రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కలిశారు. నియోజవర్గ సమస్యలను మంత్రికి ఆమె వివరించారు. ఐదు ఎకరాలకు మించి భూమి ఉందనే కారణంతో గత ప్రభుత్వం తొలగించిన రేషన్ కార్డులు, పింఛన్లు పునరుద్ధరించాలన్నారు. విలీన మండలాలైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక ప్రజలు ఇటీవల వరదలకు సర్వం కోల్పోయారని వారికి ప్రత్యేక ప్యాకేజీ అందించి పునరావాసం కల్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ ఉన్నారు.

గ్రామ బహిష్కరణ కథనంపై అధికారుల్లో చలనం

● న్యాయం జరగలేదని గిరిజన మహిళ ఆరోపణ

దేవీపట్నం, సెప్టెంబరు 18: రెండు రోజుల క్రితం చొప్పకొండ పంచాయతీలో కామారపు పండమ్మ అనే గిరిజన మహిళను గ్రామం నుంచి బహిష్కరించారని ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ బహిష్కరణకు గురైన తనకు న్యాయం చేయాలని ఆమెతో పాటు కుమార్తెలు రాణి, రజిని వేడుకున్నారు. వైసీపీ హయాంలో చొప్పకొండ పంచాయతీ పెద్దనూతలు గ్రామంలో 140 జీడిమామిడి చెట్లను వలంటీర్ నరికి వేశాడు. దీనిపై ఎస్‌ఐ కె.వెంకట నాగార్జునకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఎస్‌ఐ విచారణకు వచ్చిన గంట ముందు మాత్రమే సమాచారం ఇవ్వడం, తనపై ఎస్‌ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆమె ఆరోపించింది. ఈనెల 17న గ్రామసభలో బయట వ్యక్తులను తీసుకొచ్చి తనపై దాడి జరిపేందుకు ప్రయత్నించారన్నారు. దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.

బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి: ఎంపీడీవో

● ఘనంగా పాఠశాలల క్రీడాపోటీలు ప్రారంభం

రంగంపేట, సెప్టెంబరు 18: శారీరక, మానసిక బలాన్ని పెంచే క్రీడల పట్ల బాల్యం నుంచే ఆసక్తి పెంపొందించుకోవాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పి.వెంకటరత్నం సూచించారు. బుధవారం రంగంపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాల విద్యార్థుల క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాలురకు కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి.మధుసూధనరావు, ఎంపీడీవో ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, క్రీడాపోటీల కోఆర్డినేటర్ మేరి హవీలా, వ్యాయామ ఉపాధ్యాయులు బాపిరాజు, శైల, నాగేశ్వరరావు,బూరి బాబు, కళ్యాణి, అరుణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల యోగాసనాలు



రాజానగరం హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

రాజానగరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన మండలస్థాయి పాఠశాలల క్రీడా పోటీలు రాజానగరం హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అండర్ 14, 17 బాలికల కేటగిరిలో జరిగిన ఈ పోటీల్లో కబడ్డీ, కోకో, వాలీ బాల్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా క్రీడలకు సంబంధించి టోర్నమెంట్ కం సెలెక్షన్స్ నిర్వహించారు. దీనిలో ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని టోర్నమెంట్ కన్వీనర్, ఎంఈవో రామన్న దొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


కడియం: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

మండలస్థాయి స్కూల్ గేమ్స్

కడియం: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలకు సంబంధించి క్రీడా ఎంపికలు కడియం ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ హాజరయ్యారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో నిర్వహించే ఈక్రీడా పోటీలు రెండురోజుల పాటు జరుగుతాయన్నారు. 18న 14, 17లోపు బాలురకు, 19న 14, 17 సంవత్సరాల బాలికలకు ఈ క్రీడాపోటీలు నిర్వహిస్తారని మండల క్రీడా సమన్వయ అధికారి డేవిడ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, ఎస్‌ఎంసీ చైర్మన్ గారపాటి సత్య, వైస్‌చైర్మన్ ఎన్.విష్ణు, ఎంఈవో మణికుమార్, గ్రీన్‌లాండ్ బాబి, చిలుకూరి నాగేశ్వరరావు, ఎన్.సాయిరాం, తామెళ్ళ అయ్యప్ప పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 18: శ్రీగణపతినవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా లాలాచెరువు హౌసింగ్‌బోర్డుకాలనీలోని శ్రీవరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ వినాయకుడి ఊరేగింపు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తప్పెటగుళ్ళు, తీన్‌మార్ వాయిద్యాల మధ్య వినాయకుడి విగ్రహాన్ని కాలనీలోని వీధులలో ఊరేగించారు. యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం చేశారు. అలాగే దివాన్‌చెరువు కనకదుర్గమ్మ ఆలయంవద్ద ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించి నిమజ్జనం చేశారు.

కడియం: మండలంలో వీరవరం, దామిరెడ్డిపల్లి, దుళ్ళ, కడియపుసావరం, కడియం, కడియపులంక, పొట్టిలంక, వేమగిరి, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, మురమండ గ్రామాల గణేష్ నిమజ్జనాలు జరిగాయి. ట్రాక్టర్లు, ఆటోలను అందంగా అలంకరించి వాటిపై ఆయా గణేష్ ఉత్సవ కమిటీలు ఆధ్వర్యంలో నవరాత్రులు పూజలందుకున్న గణపతిని ఉంచి డోలు సన్నాయి, మేళతాళాలు మధ్య గణపతిని ఊరేగించారు. అనంతరం గోదావరిలో గణపతిని నిమజ్జనం చేశారు.

బిక్కవోలు: తొస్సిపూడిలోని పెద్ద వీధిలో ఏర్పాటుచేసిన వినాయకుడిని బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట ఉపసర్పంచ్ ద్వారంపూడి వీరవెంకటరామారెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, తేతలి కామరాజారెడ్డి, మల్లిడి వెంకటరెడ్డి, మేడపాటి దుర్గారెడ్డి పాల్గొన్నారు.


హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉత్సవ వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు

సంపత్ వినాయకుని లడ్డూ వేలం రూ.33వేలు

అనపర్తి: అనపర్తి ధరణికోటలో ఉన్న సంపత్ వినాయకుడి ఆలయంలో బుధవారం చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ అన్నసమారాదన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన సాయి గౌత మ్ రడీమేడ్ అధినేత నల్లమిల్లి సతీష్‌రెడ్డి రూ.33,355కు లడ్డూను వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ సంద ర్భంగా 54కిలోల లడ్డూ ప్రసాదాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీష్‌రెడ్డికి అంద జేశారు.

గర్భిణులు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 18: గర్భిణులు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం ద్వారా పండంటి బిడ్డకు జన్మనిస్తారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తి మండలం పులగుర్తలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఎమ్మెల్యే పసుపు కుంకుమలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు బాలింత వరకు ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించాలని ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్నపౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకరపర్తి వేణు, కూ టమి నాయకులు జాస్తి రాంబాబు, పేరిశెట్టి లాలయ్య, శివరామకృష్ణ, వట్టికూటి తాతాజీ, వైట్ల సుబ్బారావు, ఐసిడిఎస్ సీడీపీవో జస్సీఫ్లోరెన్స్, సూపర్‌వైజర్ రమణాంజలి, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణలత, భవాని, సూర్యకుమారి, ఇందిరాకుమారి, తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పంచాయతీ, సచివాల, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.


గర్భిణులకు పసుపు, కుంకుమ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

'ఉపాధ్యాయులు బోధనలో నాణ్యతను పెంచుకోవాలి'

కోరుకొండ, సెప్టెంబరు 18: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనలో మరింత నాణ్యత పెంచుకోవాలని మండల విద్యాశాఖాధికారులు టి.కుశలవదొర, ఎం.సుజాత పేర్కొన్నారు. కోరుకొండ మండలంలోని 54 పాఠశాలలకు సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు గతరెండు రోజులుగా కోరుకొండ, గాడాల హైస్కూల్స్‌లో నిర్వహించారు. 50శాతం మంది ఉపాధ్యాయులు మొదటిరోజు హాజరుకాగా మిగిలిన 50శాతం ఉపాధ్యాయులు రెండోరోజు పాఠశాల సముదాయ సమావేశంకు హాజరయ్యారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యారంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు ఉపాధ్యాయులకు వివరించారు. సీనియర్ ఉపాధ్యాయులు మోడల్ లెసెన్స్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించే విధానాన్ని, టీఎల్‌ఎం వినియోగించే విధానాన్ని బోధనలోని మెళుకువలను మిగిలిన ఉపాధ్యాయులకు వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘనసత్కారం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 18: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జీళ్ళ సత్యసాయి విజయప్రసాద్‌ను బుధవారం కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల పాఠశాల సముదాయ సమావేశంలో హెచ్‌ఎం రత్నబాల, రిసోర్స్ పర్సన్ డి.రాముడు, బంగార్రాజు, రాశెట్టి, డేవిడ్‌రాజు, సుమారు59 ఆంగ్లభా షా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఎం ఈవో -2చందుకుమార్ హాజరయ్యారు.


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సత్యసాయి విజయప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంఈవో-2, ఉపాధ్యాయులు

న్యాక్‌లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌పై ట్రైనర్‌లకు శిక్షణ

ధవళేశ్వరం, సెప్టెంబరు 18: నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్‌లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ట్రైనర్లకు 12రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో టీవోటీలకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు న్యాక్ సంచాలకుడు జె.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు వివిధ జిల్లాల నుంచి 50 మంది ట్రైనర్లు హాజరయ్యారన్నారు. 12రోజులపాటు నిర్వహించే ఈ రెసిడెన్షియల్ శిక్షణకు మాస్టర్ ట్రైనర్లు సీహెచ్ గంగాదాస్, ఎ.కార్తికేశ్వరయ్య శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు

కొవ్వూరు, సెప్టెంబర్ 18 : పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ అధికారులను హెచ్చరించారు. గోదావరిగట్టు కాటన్ విగ్రహం వద్ద తాత్కాలిక డంపి ంగ్ యార్డును పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడంతో ఎంఎల్‌ఎస్ ఆయిల్ స్ప్రే చేయించి, బ్లీచింగ్ చల్లించారు. రోడ్డుపై ఉన్న చెత్తను కిందకు గెంటించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని, మెరుగుపర్చాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ పారిశుధ్య సెక్రటరీలు, మేస్త్రీలకు సూచించా రు. మున్సిపల్‌మేనేజర్ పి.సాయిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీ రమణ పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు అభిషేకాలు

తాళ్లపూడి, సెప్టెంబరు 18 :తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామ దేవత మావుళ్లమ్మకు పౌర్ణమి సందర్భంగా బుధవారం అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ 108 బిందెలతో గోదావరి జలాలను తీసుకు వచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు.

175 వీధి కుక్కల పట్టివేత

కోరుకొండ, సెప్టెంబరు 18: కోరుకొండ మేజర్ పంచాయతీ మండల ప్రధాన కేంద్రంలో విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న 175 వీధి కుక్కలను బుధవారం కోరుకొండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ప్రత్యేక నైపుణ్యం గల బృందాలను ఏర్పాటుచేసి 175 వీధి కుక్కలను పట్టుకుని అటవీప్రాంతానికి తరలించినట్లు సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ వీరగణేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు.

దీపావళి మందుగుండు స్వాధీనం

గోకవరం, సెప్టెంబరు 18: గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని జన సంచార ప్రదేశంలో అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి బాణాసంచా సామగ్రి స్వాధీనంతోపాటుగా సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు గోకవరం పోలీసులు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో లైసెన్సు కలిగిన వారు మాత్రమే ప్రభుత్వ నిబంధనలకు లోబడి బాణాసంచా తయారీ లేదా విక్రయాలు చేయాలన్నారు.

వరద బాధితులకు సాయం అందజేత

రాజానగరం, సెప్టెంబరు 18 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సేకరించిన రూ.18వేల విరాళాలను బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణచౌదరికి అందజేశారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

బిక్కవోలు, సెప్టెంబరు 18: ఊలపల్లిలో కూటమి నేతల ఆధ్వర్యంలో మంగళవారంరాత్రి ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కేకును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కట్ చేయించి ఆయనకు తినిపించారు. కార్యక్రమంలో ఊలపల్లి, బిక్కవోలు సర్పంచ్‌లు బండారు రమ్య, సరెళ్ల సుమలత, కూటమి నేతలు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, జొన్నల పవన్‌కుమార్‌రెడ్డి, ఇందల వీరబాబు, కాకర్ల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

రంగంపేట, సెప్టెంబరు 18: ఇటీవల విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు సర్వంకోల్పోయిన వరద బాధితులకు బుధవారం రంగంపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గళ్ళా రామారావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రశ్నల పోటీ సభ్యులు, వల్లెం రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ సేవా సమితి గ్రూపు సభ్యులు కలిపి సుమారు రూ.60,000 విలువ చేసే 27 రకాల నిత్యావసర వస్తువులు కొని విజయవాడ వరదబాధితులకు పంపిణీ చేశారన్నారు. వాటితో పాటు మరికొందరికి ఆర్థిక సహాయం, మందులు పంపిణీ చేశామని రామారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ సేవా సమితి గ్రూపు సభ్యులు, ఆధ్యాత్మిక ప్రశ్నల పోటీ సభ్యులు పాల్గొన్నారన్నారు.

విద్యార్థుల లక్ష్య సాధనకు అధ్యాపకుల పాత్ర కీలకం

అనపర్తి, సెప్టెంబరు 18: విద్యార్థులు ఏర్పరుచుకున్న లక్ష్యాలను సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని వారి అభివృద్ధికి అధ్యాపకుల పాత్ర కీలకమని ఎంఎస్ ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మల్లిడి అనంతరెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తాపేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం సురేంద్ర చౌదరి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ తాడి సతీష్‌రెడ్డి సత్యభామ స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవీలత, ఎన్. నవీన్, టీ.రామభద్రారెడ్డి, శివయ్య పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు సబ్సిడీలపై అవగాహన

సీతానగరం, సెప్టెంబరు 18: రైతులు ఆయిల్‌పామ్ వేయదలుచుకుంటే పాటించాల్సిన జాగ్రత్తలు రైతులకు అందే సబ్సిడీలపై బుధవారం వంగలపూడి గ్రామంలోని కొయ్యలమూడి పరమేశ్వరరావు పామాయిల్ తోటలో పతంజలి ఫుడ్స్ పెద్దాపురం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పతంజలి కంపెనీ డీజీఎం ఏఎస్ ప్రకాష్, హార్టికల్చర్ ఆఫీససర్ రవిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ ఆఫీసర్ రవి మాట్లాడు తూ 2023-24కి సంబంధించి ఎరువులు, మొక్కల సబ్సి డీ నేరుగా రైతు బ్యాంక్ అకౌంట్‌కు జమచేస్తామన్నారు. డ్రిప్ సబ్సిడీ గురించి రైతులకు అవగాహన కల్పించారు. పతంజలి డీజీఎం ప్రకాష్ మాట్లాడుతూ పామాయిల్ మొక్కలకు ఎరువులు సకాలంలో వేసి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ సిబ్బంది శ్రీనివాస్, ఎం.నాగేశ్వరరావు, పి.వీరబాబు, టెక్నికల్ ఆఫీసర్ కార్తీకొరెడ్డి, రైతులు పాల్గొన్నారు

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

బిక్కవోలు, సెప్టెంబరు 18: మండలంలోని అన్ని గ్రామాల్లోను స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించామని బుధవారం బిక్కవోలు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. ఈసందర్భంగా ఊలపల్లి గ్రామంలో సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మురుగు కాలువలు శుభ్రం చేశారు. బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్‌ను, జనరేటర్ రూమ్ ను సిబ్బంది శుభ్రం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్, ఈశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన

అందరి బాధ్యత: డీఎల్ఎస్ఏ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లలను కార్మికులుగా మార్చి వారి జీవితాలను నాశనం చేస్తున్నారని, అందువల్ల బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సమాజంలోని అందరి బాధ్యతగా గుర్తెరగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశంపై కార్మిక తదితర శాఖల అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 6-14ఏళ్ల వయసు పిల్లలు ఉచిత నిర్బంధ విద్యను పొందడం వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని చెప్పారు. ఈ వయసు పిల్లలను కార్మికులుగా మార్చడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏడీసీ సత్యవేణి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎంవలి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి కె.విజయ కుమారి పాల్గొన్నారు.

నేడు రేలంగి కాంస్య విగ్రహావిష్కరణ


రేలంగి వెంకట్రామయ్య కాంస్య విగ్రహం

రాజమహేంద్రవరంసిటీ, సెప్టెంబరు 18: రాజమహేంద్రవరం గోదావరి బండ్ పై హాస్య నట చక్రవర్తి పద్మశ్రీ రేలంగి వెం కట్రామయ్య కాంస్య విగ్రహాన్ని ఈనెల 19న ఆవిష్కరిస్తున్నామని గౌడ శెట్టిబలిజ సంఘం గౌరవాధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు సంఘం అధ్యక్షుడు రెడ్డిరాజు, కన్వీనర్లు గెద్దాడ హరిబాబు, మార్గాని చంటిబాబు, కోశాధికారి కొండేటి భీమారావు ,బుడ్డిగ రవి కొండలరావులు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బుడ్డిగ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర సీమలో తన నటనతో నవ్వులు పూయించి దేశంలోనే తొలి హాస్యనటుడిగా రేలంగి నిలిచారన్నారు. కళలకు కాణాచి అయిన రాజమహేంద్రవరంలో రేలంగి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషదాయకమని ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. గురువారం రేలంగి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందు దుర్గేష్, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణలు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. ప్రత్యేక అతిథులుగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్, విశిష్ట అతిథులుగా మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, ఆదిరెడ్డి భవానీలు హాజరవుతారని బుడ్డిగ తెలిపారు.

19న బీసీ జనగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18: రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం మధ్యాహ్నం 3గంటలకు బీసీ జనగణనపై బీసీ అసెంబ్లీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన అంబేడ్కర్ భవన్‌వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్ లు జే.పూర్ణచంద్రరావు, జి.చిత్రసేనలు హాజరవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో కులగణన నిర్వహించి బీసీలకు జనాభాను బట్టి పార్లమెంట్, అసెంబ్లీలో సీట్లు రిజర్వు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో కులగణ నిర్వహించి స్థానిక సంస్థల్లోను, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని బీసీ సంఘాలు, బీసీ మేధావులు హాజరుకావాలని కోరారు.

'పడాల'కు జర్నలిస్టులు, నేతల నివాళి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18: అరసంనేత కోస్తా సమయం సంపాదకుడు పడాల వీరభద్రరావు అంత్యక్రియలు బుధవారం రాజమహేంద్రవరంలో జరిగాయి. గోరక్షణపేటలోని ఆయన నివాసంలో పడాల వీరభద్రరావు పార్థీవదేహానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారధి, మండేల శ్రీరామ్మూర్తి, జమ్మా రాజారమేష్, నగర ప్రముఖులు డాక్టర్ కర్రి రామారెడ్డి, దేశిరెడ్డి బలరామనాయుడు, సీనియర్ పాత్రికేయులు రవికాంత్, నాని, కళాధర్, వి.రామకృష్ణ, ఎంబీవీ సారధి, శ్రీనివాస్ యాదవ్, దామోదర్ తదితరులు నివాళులు అర్పించారు. పడాల సేవలను గుర్తుచేసుకున్నారు. పడాల కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సత్యసాయి వాటర్ స్కీం కార్మికులకు న్యాయం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 : గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని సత్యసాయి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 17 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీఎన్ పూర్ణిమరాజు అన్నారు. బుధవారం లాలాచెరువు భాస్కర్‌నగర్ ఏరియాలో కార్మికులు చేస్తున్న ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీతాల కోసం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను సంప్రదించినా సమాధానం రావడంలేదని, ప్రభుత్వం వైపు నెడుతున్నారన్నారు. దీనిపై కలెక్టర్‌కు, లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశామని కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ ధర్నాలో ప్రైవేట్ ఆసుపత్రుల యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్, యూనియన్ అధ్యక్షులు కట్టమూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన


రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆచరణలో సాధ్యపడని లక్ష్యాలను విధించి, ఆన్‌లైన్ శిక్షణ కోర్సుల పేరుతో అధికారులు వేధిస్తున్నారని, దీనికి నిరసనగా ఎన్ఎఫ్‌పీఈ రాష్ట్ర సమన్వయ కమిటీ, ఏఐజీడీఎస్‌యూ రాష్ట్ర సంఘాల పిలుపుతో రాజమండ్రి ప్రధాన తపాలా కార్యాలయంవద్ద బుధవారం నిరసన తెలియజేశామని పీ4 ఉద్యోగుల సంఘం కార్యదర్శి జేవీ సత్యనారాయణ పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక ఏడాది ప్రారంభం నుంచి కూడా అధికారుల వేధింపులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని జీడీఎస్ యూనియన్ అధ్యక్షుడు బీవీ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సర్కిల్ సూపరింటెండెంట్‌కి వినతి పత్రం సమర్పించారు.





జిల్లా రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రార్‌గా రెడ్డి సత్యనారాయణ నియమితులయ్యారు. జిల్లా రిజిస్ట్రార్లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిలో భాగంగా ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు.రెడ్డి సత్యనారాయణకు గతంలో ఈ జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.



భయం..భయం!

అటవీ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం

చుట్టూ నగరం..మధ్యలో జాతీయ రహదారిని ఆనుకుని అడవి.. ఆ అడవిలో ఒక చిరుత పులి.. ఎక్కడ నుంచి ఎలా వచ్చిందో తెలియదు.. 13 రోజులైంది.. ఎటుందో.. ఎటెళ్లుతుందో తెలియదు.. అంతా అయోమయం.. అధికారులు పట్టుకుంటామనడం తప్ప.. కనీస రక్షణ చర్యల్లేవ్.. అడవిని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై కనీసం లైట్లు లేవు.. రాత్రయిందంటే అంతా చీకటే.. ఏం జరిగినా ఇక అంతే.. చిరుత పులి ఉంది జాగ్రత్త అనే హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేశారా అంటే అదీలేదు..నగరంలోనే ఉన్న పర్యాటక శాఖ మంత్రయినా పట్టించుకుంటారా అంటే అదీలేదు.. జిల్లా కేంద్రం చెంతనే ఉన్నా కలెక్టర్ మాట్లాడడం లేదు.. ఎమ్మెల్యేలు నోరు మెదపడంలేదు.. ప్రజల ప్రాణాలను చిరుత పులికి వదిలేసి చోద్యం చూస్తున్నారు.. ఈ కాస్త నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాల మీదకు తెచ్చేలా ఉంది.!?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అటవీ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.. రిజర్వు ఫారెస్టులోని చిరుతను తక్కువ అంచనా వేస్తున్నారు.. కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా ప్రజలను భయంలోకి నెట్టేస్తున్నారు..ఎవరి మీదనైనా దాడి చేస్తేనే కానీ రక్షణ చర్యలు చేపట్టేలా కనిపించడంలేదు. రిజర్వు ఫారెస్టు జనావాసం మధ్యన ఉండడంతో జనం మాత్రం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బయటకు రావాలంటేనే గజగజ వణికిపోతున్నారు. అటవీ అధికారులు మాత్రం ప్రతి రోజూ ప్రకటనలకే పరిమితమైపోతున్నారు. చిరుత సంచరిస్తున్నట్టు ఈ నెల 6న తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచీ రాజమహేంద్రవరం శివారు లాలాచెరువు నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా 532.18 హెక్టార్లలో ఉన్న అభయారణ్యంలో సంచరిస్తోంది. ఈ అడవిని ఆనుకునే శ్రీరాంపురం, దివాన్ చెరువు, లాలా చెరువు, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాలు ఉన్నాయి. రిజర్వు ఫారెస్టు చుట్టూ ఉన్న ప్రజలు బయటకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం రాజమహేంద్రవరం వచ్చేవారు.. రాజమహేంద్రవరం వైపు నుంచి దివాన్‌చెరువు వైపు వచ్చేవారు ప్రాణాలు అరచేత పట్టుకుంటున్నారు. ఒకవేళ చీకటి పడితే కంగారుపడుతున్నారు. ఇంటికి వెళ్లే దారిలో ఏదైనా చప్పుడు అయితే గుండెలు గుభేల్ మంటున్నాయి. మేకలు, గొర్రెలు, గేదెలను పగటి వేళల్లో మేత కోసం గ్రామాల శివారుల్లోకి తోలుకెళతారు. చిరుత భయంతో వాటికి సరైన గ్రాసం కరువైంది. ఇళ్లు, మకాంల దగ్గర కట్టేసిన సమయంలో ఏదైనా అలజడి జరిగితే అక్కడ ఉన్న వాళ్లకు పై ప్రాణం పైనే పోయినంత పనవుతోంది. నగరంలోకి చదువు కోసం వస్తున్న పిల్లలు ఇంటికి వచ్చే వరకూ టెన్షన్‌తో ఎదురు చూస్తున్నారు. సీతాఫలాల సీజన్ కావడంతో రైతులు తోటలకు వెళ్లేం దుకు తటపటాయిస్తున్నారు.

అయోమయం.. వెన్నాడుతున్న భయం

జాతీయ రహదారికి అటు ఇటు.. అంటే అటవీ శిక్షణా కేంద్రం, శ్రీరాంపురం వైపు.. హౌసింగ్ బోర్డు, ఆటోనగర్ వైపు అభయారణ్యం విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో ముందు 50 ట్రాప్ కెమెరాలు పెట్టి తర్వాత ఆ సంఖ్యను 73కు పెంచారు. మూడు రోజుల కిందట వరకూ చిరుత ఏదోక ట్రాప్ కెమెరాలో చిక్కింది. కానీ ఆయా ప్రాంతాలు ఏ జనావాసాలకు దగ్గర ఉన్నాయో కూడా వెల్లడి కాలేదు. అటవీ శిక్షణ కేంద్రం వెనుక భాగంలో ఉన్న అటవీ ప్రాంతంలో పందులు, కుక్కలు, కోతులు ఎక్కువ. ఆహారం సమృద్ధిగా దొరుకుతుండడంతో ఇక్కడే పులి సంచరిస్తుందని అందరూ భావించారు. కానీ మంగళవారం అటవీ శాఖ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పుష్కరవనం వైపు నుంచి అటవీ శిక్షణ కేంద్రం వైపు వచ్చిందని చెప్పడంతో అంతా అవాక్కయ్యారు. పులి కనబడిన ప్రాంతాన్ని అటవీ శాఖ అధికారులు స్పష్టంగా వెల్లడిస్తే ఆయా ప్రాంతాల నివాసులు అప్రమత్తమయ్యే అవకాశం ఉంది. కానీ పులి ఫొటోకు చిక్కింది.. ఈ రోజు కనబడలేదు.. హైవే దాటింది.. అంటూ ముక్తసరి మొక్కుబడి ప్రకటనలతో అయోమయం నెలకొని భయపడుతూ బతికే పరిస్థితి దాపురించింది.

హైవేలో లైటింగ్ పెట్టకూడదా?

లాలాచెరువు నుంచి దివాన్ చెరువు జీరో పాయింట్ వరకూ. అటవీ శిక్షణా కేంద్రం ప్రాంతంలో పులి సంచారం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఆ పరిధిలో ఉండే జాతీయ రహదారి ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. పగలు, రాత్రి వేళల్లో కూడా ఈ ప్రాంతంలో వాహనదారులు సేదతీరడానికి, మలమూత్ర విసర్జనలకు ఆగుతుంటారు.పగటిపూట పండ్లు, కూరగాయలు విక్రయిస్తుంటారు. అయినా లాలాచెరువు నుంచి దివాన్ చెరువు వరకూ కనీస రక్షణ చర్యలు చేపట్టలేదు. రిజర్వు ఫారెస్టు కావడంతో రాత్రయితే ఆ ప్రాంత మంతా చీకటిమయం. కనీసం లైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో అటు పులితో పాటు ఇటు వాహనదారులకు ప్రమాదమే. పులి సంచరిస్తోంది..ఇక్కడ ఆగవద్దు లాంటి ముందస్తు హెచ్చరిక బోర్డు ఒకటీ లేదు. ఆయా ప్రాంతాల ప్రజలకు జాగ్రత్తలు చెబుతున్నారు.కానీ ఎక్కడి నుంచో వచ్చే వాహనదారులకు చిరుత పులికథ ఎలా తెలుస్తుందనే మీమాంస నెలకొంది. ఇక్కడ కీలకమైన విషయం మరొకటి ఉంది. ఇటు వన్యప్రాణి అయిన పులికి ఏదైనా అపాయం జరిగినా ఇబ్బందే.. అటు ప్రజలకు ఏదైనా హాని జరిగినా సమస్యే? దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

- జనారణ్యంలో చిరుత పులి
- కానరాని కనీస రక్షణ చర్యలు
- లైట్లూ లేవు.. బోర్డులు లేవు
- నాయకులు..కలెక్టర్‌కూ పట్టదు
- ఆందోళనలో ప్రజానీకం
- ప్రకటనలకే అటవీ శాఖ పరిమితం

నాయకులకూ పట్టదా..?

13 రోజులు.. 73 కెమెరాలు.. 8 బోన్లు.. 9 బృందాలు.. 50 మందికిపైగా అటవీ సిబ్బంది.. డ్రోన్ కెమెరా.. రోజూ ప్రకటనలు.. చిరుత మాత్రం చిక్కడం లేదు. యంత్రాంగం పనితీరు ఎలా ఉన్నా ఆయా ప్రాంతాల జనం మాత్రం హడలిపోతున్నారు. పగటిపూట బయటకు రావాలన్నా దడదడలాడుతున్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇక్కడే ఉన్నారు. అటవీ శాఖను సాక్షాత్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చూస్తున్నారు. అయినా చిరుతను పట్టుకునే విషయంలో యంత్రాంగం పట్టు తప్పుతూనే ఉంది. జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరం లోనే చిరుత సంచారం ఉన్నా కలెక్టర్ కూడా పెద్దగా పట్టించుకున్నట్టు లేదనే విమర్శలున్నాయి. ఇక పులి సంచరిస్తున్న ప్రాంతాల పరిధి నియోజకవర్గాలైన రాజానగరం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, సిటీ ఎమ్మెల్యేలు పెద్దగా పట్టనట్టు ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తో ంది. విషయం తీవ్రమైతే అప్పుడు చూద్దామనే ధోరణిలో ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా బుధవారం డీఎఫ్‌వో ఎస్.భరణి బుధవారం దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే చిరుతపులి సంచరిస్తోందని మరో ప్రకటన విడుదల చేశారు. రక్షణ చర్యలపై డీఎఫ్‌వోను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

నిత్యావసర ధరలపై దృష్టి పెట్టాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 : నిత్యావసర ధరల నియంత్రణకు అధికారయంత్రాంగం తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ధరల పర్యవేక్షణ, స్థిరీకరణ, నియంత్రణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ధరల నియంత్రణకు ఏర్పాటైన కమిటీ తగిన సిఫార్సులు చేయాలన్నారు. జిల్లాలో ఏయే సీజన్లలో ఏయే కూరగాయలు పండిస్తున్నారు, దిగుబడి ఎంత వస్తున్నదీ అనే వివరాల నెలవారీ గణాంకాలను కచ్చితంగా సేకరించి అధ్యయనం చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా నిత్యావసర ధరలపై దృష్టి పెట్టాలన్నారు. దళారుల ప్రమేయాన్ని నియంత్రించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఆర్డీఓ కేఎల్ శివజ్యోతి, జిల్లా పౌరసరఫరాల అధికారి విజయభాస్కర్, డీఎంసీ రాధిక, జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్, కమిటీ సభ్యులు, ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపార ప్రతినిధులు, ధరల నియంత్రణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ స్వచ్ఛత హీ సేవ ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18: సమాజం పరిశుభ్రంగా ఉంటేనే అభివృద్ధి ఆరోగ్యం సాధ్యమవుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం వైజంక్షన్ నుంచి నందంగనిరాజు సెంటర్ వరకు బుధవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ చేశారు. జెండా ఊపి ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో అందరూ బాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి వి వెంకట్రాజు, ఉప విద్యాశాఖ అధికారి ఇవిబి యన్ నారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై డయల్ 18004254156

రాజానగరం, సెప్టెంబరు 18 : బాల్య వివాహాలు నేరం అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పొటెక్షన్ ఆఫీసర్ జి.క్రాంతిలాల్ అన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, క్రాఫ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరిగినట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100కి జిల్లా మేజిస్ట్రేట్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004254156కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ బి.రాజ్‌కుమార్, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, సీడీపీవో టి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు కమిషనర్‌గా నాగేంద్ర కుమార్




కొవ్వూరు, సెప్టెంబరు 18 : కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా టి.నాగేంద్రకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కొవ్వూరు కమిషనర్‌గా పనిచేసిన కె.డానియేల్ జోసఫ్ కనిగిరి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీఅయ్యారు. పలాస మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న నాగేంద్రకుమార్ కొవ్వూరు వచ్చారు. మునిసిపల్ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మునిసిపల్ మేనేజర్‌గా పి.సాయిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మేనేజర్‌గా పనిచేసిన జి.రాధాకృష్ణ కోనసీమ జిల్లా రామచంద్రపురం మునిసిపాలిటీకి రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా బదిలీ అయ్యారు. పిఠాపురం మునిసిపాలిటీ నుంచి సాయిబాబు కొవ్వూరు వచ్చారు. కొవ్వూరు మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.వి.వి.రమణ బదిలీపై భీమవరం వెళ్లారు.

వరద బాధితులకు రూ.83,44,624

కడియం, సెప్టెంబరు 18 : దాతలు స్పందిస్తున్నారు.. మేం ఉన్నాం అంటూ ముందుకొస్తున్నారు.సాయం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్లబుచ్చయ్యచౌదరి తన నియోజకవర్గ పరిధిలో కూటమి నాయకులు, పలు రంగాలకు చెందిన ప్రతినిధులు నుంచి స్వచ్ఛందంగా రూ. 83,44,624 సేకరించారు. నిధులు ఇచ్చిన నాయకులు, ప్రతినిధులతో కలిసి ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే గోరంట్ల విజయవాడలో బుధవారం సీఎం చంద్రబాబుకు అందించారు. విజయవాడ బుడమేరు వరద బాధితులకు సహాయం అందించిన రూరల్ నియోజకవర్గ కమిటీలు, వివిధ రంగాల ప్రతినిధులను ఏకం చేసి నిధులు సేకరించిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్లను సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు.



స్పందించిన చేతులు : విజయవాడలో బుధవారం సీఎం చంద్రబాబు నాయుడికి రూ.83.44, 624ల చెక్ అందజేస్తున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, తదితర నాయకులు



నాట్..గుడ్డు!

సంక్షోభంలో కోళ్ల పరిశ్రమ

అనపర్తి, సెప్టెంబరు 18 : మేతల ధరలు పెరుగుతున్నాయి.. గుడ్డు ధర చూస్తే మాత్రం పెరగదు..ఎప్పుడూ రూ.5. నుంచి రూ.6ల మధ్యనే . దీంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. మేత ధరలు తక్కువగా ఉన్న సమయంలో గుడ్డు ధర రూ.3లకు విక్రయించినా లాభసాటిగా ఉండేది. ప్రస్తుతం గుడ్డు ధర నిలకడగా ఉన్నా అదే పరిస్థితి. ఏపీలో పెరిగిన ఫీడ్, మందులు, ఇతర ఖర్చులకు కనీసం గుడ్డు ధర రూ.5.50 నుంచి రూ.6.00 వరకు పలికితే రైతులు నష్టాల భారిన పడకుండా బయటపడే పరిస్థితి ఉంది. అయితే ఈ ధర ఏడాదిలో కనీసం రెండు మూడు నెలలు కూడా ఉండడంలేదని లేదని రైతులు వాపోతున్నారు. ఏడాదంతా అన్ సీజన్‌గా మారి నష్టాల బాట పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఒరిస్సా రాష్ట్రంలో 15 లక్షలకే పరిమితమైన కోళ్ల పరిశ్రమ నేడు 1.50 కోట్ల కోళ్ళతో రోజుకు సుమారుగా 1.20 లక్షల గుడ్లు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుంది.బీహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో కూడా కోళ్ల పరిశ్రమలు పెరగడం అక్కడ గుడ్డుకు రూ.6లు పలకడంతో రైతులు కోళ్ళ సంఖ్యను పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమిళనాడులో కూడా కోళ్ళ పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. అక్కడి నుంచి కేరళ, కర్నాటక రాష్ట్రాలకు గుడ్లు సరఫరా జరుగుతుండడంతో పరిశ్రమ ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది. ఒకప్పుడు కోళ్ళ పరిశ్రమకు పెట్టింది పేరుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం అయోమయస్థితిలో కొట్టుమిట్లాడుతుంది. నెక్ జోన్ ప్రకటించిన రేటుకు గుడ్లుకొనే పరిస్థితి నుంచి లోడు చేరిన తరువాత అక్కడి ట్రేడర్లు రేటు నిర్ణయించే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.ఏడాదిలో మూడు నెలల సీజన్‌కు రైతులు ఎదురు చూసేవారు. నవంబరు,డిసెంబరు,జనవరి నెలల్లో గుడ్డు ధర పెరగడం ఏడాదిలో మూడు నెలల్లో వచ్చిన లాభంతో మిగిలిన నెలల్లో వచ్చిన ఒడిదుడుకులను ఎదుర్కొనే ధైర్యంతో రైతులు ఉండేవారు.ఏడాదంతా అన్‌సీజన్‌గా మారడంపై ఆందోళన చెందుతున్నారు.

మేత ధరలతో రైతుల కుదేలు

కోళ్ళ పరిశ్రమలో కోళ్ళ దాణాకు వినియోగించే నూక, మొక్కజొన్న ధరలు విపరీతంగా పెరగడంతో రైతులకు పెనుభారంగా మారాయి. క్వింటా వెయ్యి నుంచి పన్నెండు వందల వరకు లభ్యమయ్యే వీటి ధరలు ప్రస్తుతం రూ.2700 నుంచి రూ.3000 వరకు పెరిగాయి.ఈ లెక్కన ప్రస్తుతం దాణా టన్నుకు రూ.30 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. మరో పక్క కోళ్ళ మందుల ధర పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లక్ష ఉన్న ఫారాలు ప్రస్తుతం సగానికి సగం తగ్గించుకుంటూ పోవడంతో దిగుబడి తగ్గింది.కోళ్ళ సంఖ్య తగ్గించినప్పటికీ మిగిలిన నెలవారీ ఖర్చులు ఆదేస్థాయిలో ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో నష్టాలకు భయపడి అనేక మంది రైతులు కోళ్ళ సంఖ్యను తగ్గించుకుని ముందుకు సాగుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి..

కోళ్ళ పరిశ్రమను ప్రోత్సహించేందుకు అనేక రాష్ట్రాలు రైతులకు రాయితీలు ప్రకటిస్తున్నాయి.

- పెరుగుతున్న మేత ధరలు
- గిట్టుబాటు కాని గుడ్డు ధర
- ఆందోళనలో రైతాంగం
- గత వైసీపీలో అయోమయం
- అందని ప్రభుత్వ రాయితీలు
- ఇతర రాష్ట్రాల్లో లాభసాటిగా..
- ఏపీలో పరిశ్రమ పతనం
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

మన రాష్ట్రంలో గత ప్రభుత్వం ఐదేళ్లలో ఎటువంటి రాయితీలను ప్రకటించకపోగా అంతకు ముందున్న తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన రాయితీలను గత ప్రభుత్వం తొలగించడంతో పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. మరో వైపు విద్యుత్ చార్జీలు అధికం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లక్ష కోళ్ళు ఉన్న పరిశ్రమకు సుమారుగా నెలకు రూ.75 వేలు.. వేసవిలో రూ.లక్ష వరకు విద్యుత్ బిల్లు చెల్లించాల్సి రావడం రైతులకు భారంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వంపై కోళ్ళ రైతులు ఆశలు పెట్టుకున్నారు.కూటమి ప్రభుత్వం బ్యాంకు రు ణాలపై వడ్డీ రాయితీ, విద్యుత్ చార్జీల తగ్గింపు, మొక్కజొన్నసూకలు వంటి వాటిపై సబ్సిడీ అందించి పరిశ్రమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



చినుకుపడితే.. మునకే!?

బుడమేరు ఘటనతో ఆందోళన

బుడమేరు పొంగింది.. విజయవాడ నగరం ముంపులో చిక్కుకుంది..ఈ కష్టానికి కారణమెవరా ఆరా తీస్తే.. ఇంకెవరు అక్రమార్కులు అని తేలిం ది.. వాళ్లెవరంటారా.. కరకట్టలు కొట్టేసినవారు.. డ్రైనేజీలు ఆక్రమించేసిన వారు.. నగరంలో ఆక్రమణలే నేడు ఈ పరిస్థితికి తెచ్చాయి.. మరి మన తూర్పుగోదావరి జిల్లాలో జిల్లా కేంద్రం పరిస్థితేం టో ఒకసారి చూద్దామా.. రాజమహేంద్రవరంలో గంట చినుకుపడితే చాలు నగరం గోదారిలా మారిపోతోంది.. ఇక కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. ఎందుకంటే... ఎక్కడ చూసినా డ్రెయినేజీల ఆక్రమణలే..

- రాజమహేంద్రిలో భయంభయం
- గంట వానపడితే నగరం గోదారే
- కొవ్వూరు..నిడదవోలులోనూ ఇంతే
- అడ్డగోలుగా డ్రైనేజీలు, కాలువల ఆక్రమణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18 : రోజురోజుకు విస్తరిస్తున్న నగరం రాజమహేంద్రవరం..ఈ నగరంలో అన్ని ప్రధాన రహదారులకు అనుసంధానంగా సుమారు 600 కిలోమీటర్ల పైబడి డ్రైనేజీ వ్యవస్థ ఉంది. నిత్యం చిన్నపాటి డ్రైనేజీల గుండా మురుగునీరు ప్రవహిస్తుంది. సుమారు 70 వేల గృహాలు, 20 వేల వ్యాపార సంస్థలు కలిగిన నగరంలో అనునిత్యం లక్షల లీటర్లు వాడిన నీరు ఇళ్ళ గుండా డ్రైనేజీల్లోకి చేరి అక్కడ నుంచి కొన్ని కూడళ్లలో ఉన్న ప్రధాన డ్రైనేజీలకు కనెక్ట్ అక్కడ నుంచి నీరు దిగువకు చేరి స్టోరేజ్ ట్యాంకుల్లోకి వెళ్లడం లేదా నేరుగా నల్లచానల్ గుండా గోదావరిలోకి వెళ్లిపోతుంది.

గంటలో నగరం మునకే..

సాధారణంగా డ్రైనేజీలు గంట పాటు బ్లాక్ అయితేనే నగరంలో చాలా ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్డెక్కుతుంది. అటువంటిది వర్షాకాలంలో దీని తీవ్రత పైస్థాయిలో ఉంటుంది. వర్షాకాలం కాకపోయినా డ్రైనేజీ వాటర్ బ్లాక్ అయితేనే నగరంలో ముంపు సమస్య వస్తుంది. తుమ్మలావ, రామచంద్రరావుపేట,ఆదెమ్మదిబ్బ, కృష్ణానగర్, ఆర్యాపురం తదితర ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డెక్కేస్తుంది. దీనికి ప్రధాన కారణం ఆక్రమణలే. నగరంలో చాలా ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు,షాపింగ్ మాల్స్ నివాస గృహాలు నిర్మిస్తున్నారు. ఆయా భవనాల నిర్మాణంలో పబ్లిక్ డ్రైనేజీలనే ఆక్రమించేశారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలపై ప్రైవేట్ వ్యాపార సంస్థల నిర్వాహకు లు శ్లాబులు వేసేశారు. వాటిని అడ్డుకోవడం, తీసివేయడం వంటి పనులు కార్పొరేషన్ అధికారులు చేయకపోవడంతో చినుకు పడితే చాలు నగరం చెరువుగా మారిపోతోంది. ఒకసారి పాత డ్రైనేజీల నిర్మాణాలు పరిశీలిస్తే ఎంత ఆక్రమణలు జరి గాయో అధికారులకు అర్థమవుతుంది. టీటీడీ కల్యాణ మండపం ప్రాంతమంతా 50 ఏళ్ళ కిందట చెరువే. కానీ ఇప్పుడు ఆ చెరువులు లేవు. కొన్ని ప్రాంతాల్లో వాటర్ స్టోరేజీకి వినియోగించే స్థలాలు కబ్జాలకు గురయ్యాయి. నగరంలో భారీ వర్షం వచ్చినప్పుడు సుమారు 70 శాతం నగరం ముంపుబారిన పడుతుంది.

వైసీపీలో ఇష్టానుసారం పనులు

గత ప్రభుత్వ హయాంలో నగరంలో రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల్లో ఇంజనీరింగ్ వ్యవస్థను పక్కన పెట్టేశారు. ఫలితంగా ఇప్పుడు నగరాన్ని ముంపు సమస్య వెంటాడుతోం ది. కొన్ని ప్రాంతాల్లో రహదారులను హైట్ చేసి డ్రైనేజీలను వదిలేశారు. కొన్ని చోట్ల డ్రైనేజీలను హైట్ చేసి రహదారులను డౌన్ చేశారు. కూడ ళ్లను ఎత్తుచేసి రోడ్డును కుదించేశారు. దీంతో కూడలి గుండా వెళ్ళే వర్షపునీరు రహదారిపై నిలిచిపోతుంది. నగరంలో ఎత్తు ప్రదేశాల నుంచి వచ్చే వర్షపు నీరు నేరుగా ప్రధాన డ్రైనేజీలకు అనుసం ధానం చేయడంలో అక్కడక్కడా వైఫల్యాలు ఉన్నాయి.దీంతో చినుకుపడితే నగరం ముంపుబారిన పడిపోతుంది. రోడ్డెక్కిన నీరు డ్రైనేజీ గుండా డౌన్‌కు చేరడంలేదు. ఫలితంగా రహదారులపై చెత్తచెదారాలు నిలిచిపోయి దుర్గంధం భరితంగా మారిపోతుంది. డ్రైనేజీలపై శ్లాబులు వేసేయడం వల్ల వర్షపు నీరు మురుగు నీరు పారుదల కష్టంగా మారిపోతుంది. గట్టిగా గంట వర్షంపడితేనే నగరంలో వీఎల్‌పురం మొదలుకొని ఆర్టీసీ కాంప్లెక్స్, తాడితోట, రైల్వేస్టేషన్ రోడ్డు, దేవిచౌక్, తుమ్మలోవ, రామచంద్రరావు పేట, కంబాలచెరువు హైటెక్ బస్టాండ్, వై.జంక్షన్, కోరుకొండరోడ్డు, లలితానగర్, పేపరు మిల్లు రోడ్డు తదితర ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. నగరం లో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిస్తే చాలా వరకు ముంపు సమస్యలు పరిష్కారం అవుతాయి. లేకుంటే బుడమేరు పొంగితే విజయవాడ ఎటువంటి పరిస్థి తిని ఎదుర్కొందో అంతకంటే దారుణ పరిస్థితులు రాజమహేంద్రవరం ఎదుర్కొనే అవకాశం ఉంది.



నగరంలోని ఒక వీధిలో ఇలా..

ఆక్రమణల తొలగింపునకు 3 బృందాలు
కమిషనర్ కేతన్‌గార్గ్

నగరంలో ఆక్రమణల తొలగింపునకు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ 3 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం 32వడివిజన్‌లో అజాద్ చౌక్ క్లాక్ టవర్ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు 26 చోట్ల డ్రైనేజీలపై ఆక్రమణలు, 15 రూఫ్ షెడ్లను,రెండు తోపుడు బళ్లను బుధవారం తొలగించారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారుల్లో ఉన్న అభ్యంతరకరమైన ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులుపై ఉన్న మెట్లు, ర్యాంపులను తొలగిస్తున్నామని చెప్పారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు, సెప్టెంబర్ 18 : పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ అధికారులను హెచ్చరించారు. గోదావరి గట్టు కాటన్ విగ్రహం వద్ద తాత్కాలిక డంపింగ్ యార్డును పరిశీలించారు. ఇటీవల కురిసన వర్షాలకు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడంతో ఎంఎల్ఎస్ ఆయిల్ స్ప్రే చేయించి, బ్లీచింగ్ చల్లించారు. రోడ్డుపై ఉన్న చెత్తను కిందకు గెంటించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని, మెరుగుపర్చాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ పారిశుధ్య సెక్రటరీలు, మేస్త్రీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి. సాయిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీ రమణ, సబ్బంది పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు అభిషేకాలు



అభిషేకాలు చేస్తున్న మహిళలు

తాళ్లపూడి, సెప్టెంబరు 18 :తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామ దేవత మావుళ్లమ్మకు పౌర్ణమి సందర్భంగా బుధవారం అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ 108 బిందెలతో గోదావరి జలాలను తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం దాతలు బహూకరించిన మకరతోరణం అమ్మవారికి అలంకరించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గోష్పాదక్షేత్రంలో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న పురోహితులు

కొవ్వూరు, సెప్టెంబర్ 18 : కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో వేంచేసిన జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో బుధవారం చండీ హోమం నిర్వహించారు. సమిశ్రగూడేనికి చెందిన గంప వెంకటకృష్ణారావు, భాస్కరీదేవి దంపతులు ఈ హోమం చేపట్టారు. గణపతి పూజ, నవగ్రహ పూజక, కలశ ప్రతిష్ఠాపన, చండీ పరదేవతకు అష్టోత్తరనామ పూజ, చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చామర్తి విశ్వనాథరావు, ఆకెళ్ల సురేష్‌కుమార్, వాడ్రేవు సాయి కామరాజ్, చిరవూరి సుబ్రహ్మణ్యం, బళ్లమూడి సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో పూజలు



ఆదిశంకరాచార్య ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

దేవర పల్లి, సెప్టెంబరు 18: దేవరపల్లిలో ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మీ దేవికి, గణపతి, లక్ష్మీసరస్వతి అమ్మవార్లకు, ఆదిశంకరాచార్యులకు వేదపండితులు వెంకటసాయిశర్మ పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సౌందర్యలహరి పారాయణ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్.వెంకటహరనాథ్, తోట సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, కరు టూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ హోమం

దేవరపల్లిలోని పూర్ణయోగ ఆశ్రమంలో గురువారం పూర్ణయోగా రామచంద్రగురూజీ ఆధ్వర్యంలో గాయత్రీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగసాధకులు అనిశెట్టి శ్రీనివాస్, అడపా పాండురంగారావు దంపతులు, దోనెల్లి మధుబాబు, గమిని నాని, తదితరుల పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గం ఎన్నిక

ఉండ్రాజవరం, సెప్టెంబరు18: ఉండ్రాజవరం గ్రామంలో బుధవారం ఉండ్రాజవరం బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సమావేశంలో గ్రామ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా ఏలేశ్వరపు భాస్కరరావు, అధ్యక్షుడిగా జోశ్యుల వెంకట సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా రాపర్తి వెంకట రామయ్య, కార్యదర్శిగా జోశ్యుల శివ కృష్ణ, కోశాధికారిగా జోశ్యుల విజయ కుమార్, కార్యవర్గ సభ్యులుగా పోడూరి ఆదినారాయణ శర్మ, సత్యనారాయణమూర్తి, పి. శ్రీనివాసు, కె.కిరణ్, జె.ఉదయ్, మద్దిరాజు సూర్యనారాయణ ఎన్నికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం అధ్యక్షుడు గాదిరాజు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కుదర చక్రపాణి, డి. సుధాకర్, ఆకెళ్ళ శ్రీనివాస్, రామకృష్ణమూర్తి, ఏడుకొండలు పాల్గొన్నారు.

నేడు రేలంగి కాంస్య విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరంసిటీ, సెప్టెంబరు 18: రాజమహేంద్రవరం గోదావరి బండ్ పై హాస్యనట చక్రవర్తి పద్మశ్రీ రేలంగి వెం కట్రామయ్య కాంస్య విగ్రహాన్ని ఈనెల 19న ఆవిష్కరిస్తున్నామని గౌడ శెట్టిబలిజ సంఘం గౌరవాధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు సంఘం అధ్యక్షుడు రెడ్డిరాజు, కన్వీనర్లు గెద్దాడ హరిబాబు, మార్గాని చంటిబాబు, కోశాధికారి కొండేటి భీమారావు బుడ్డిగ రవి కొండలరావులు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బుడ్డిగ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర సీమలో తన నటనతో నవ్వులు పూయించి దేశంలోనే తొలి హాస్యనటుడిగా రేలంగి నిలిచారన్నారు. కళలకు కాణాచి అయిన రాజమహేంద్రవరంలో రేలంగి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషదాయకమని ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. గురువారం రేలంగి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందు దుర్గేష్, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణలు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు.

కార్మికులకు వైద్యపరీక్షలు

చాగల్లు, సెప్టెంబరు 18: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా చాగల్లు పంచాయతీ కార్మికులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైదులు డాక్టర్ తనూజ, మనోజ్‌ల ఆధ్వర్యంలో వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

విశేష అలంకరణలో బాల త్రిపుర సుందరి

కొవ్వూరు, సెప్టెంబర్ 18 : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని చామంతి పూలతో విశేష అలంకరణ చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భ ంగా వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



ఎమ్మెల్యే ముప్పిడికి చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎన్వీ సుబ్బారావు



ఎమ్మెల్యే ముప్పిడికి విరాళం చెక్కు అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మేము సైతం..

వరద బాధితులకు విరాళాలు అందజేత

కొవ్వూరు, సెప్టెంబర్ 18 : కొవ్వూరు పట్టణంలోని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాల విద్యార్థులు వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు రూ. 60,080 చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి మేమున్నాం అంటూ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేసిన కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఏ విపత్తు సంభవించినా సామాజిక బాధ్యతతో తమవంతు సాయం అందిస్తామన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి విద్యార్థులు కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో రూ. 3,11,000 సేకరించారన్నారు. త్వరలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ చలపతిరావు, డాక్టర్ వై. రమేష్, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, మద్దిపట్ల మురళీ, కె. విజయకుమార్, కంటమణి ప్రసాద్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

చాగల్లు, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాదితుల కోసం మండలంలోని దారవరంకి చెందిన టీడీపీ, జనసేన నాయకులు విరాళాలు సేకరించారు. రూ. 1,00,116ను విరాళాలుగా సేకరించి బుధవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంక టేశ్వరరావుకు చెక్కు రూపంలో అందజేశారు.కొవ్వూరులో జరిగిన కార్యక్రమంలో మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు బొడ్డు రాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పాలకుర్తి శ్రీనివాసరావు సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



దేవరపల్లిలో క్రీడలు ప్రారంభిస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, సెప్టెంబరు 18: విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. బుధవారం దేవర పల్లి అంబటి సత్యనారాయణరావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గోపాలపురం నియోజకవర్గంలోని నియో జక వర్గ స్థాయి క్రీడలు నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ సాధించి మన నియోజకవర్గానికి, జిల్లాకి మంచిపేరు తీసుకురావాలన్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల నుంచి 300మంది క్రీడాకారులు పాల్గొనగా 130 మంది నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎంపీడీఓ ఎం.తిరుమలదాసు తెలిపారు. ఈ పోటీలు అథ్లెటిక్స్, యోగా, చెస్, షెటిల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో అండర్ 14, 17 బాలబాలికలకు జరిగాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు అంద్రూ అనీల్, టీడీపీ, జనసేన నాయకులు సుంకర దుర్గారావు, కరుటూరి శ్రీనివాస్, ఉప్పులూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం'



సుభాష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు

గోపాలపురం, సెప్టెంబరు 18: జనసేన పార్టీ కోసం పని చేస్తున్న ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. మండలంలోని సగ్గొండ గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త ఇటీవల మృతి చెందిన చాపల సుభాష్ కుటుంబానికి రూ.ఐదు వేల నగదుతో పాటు 150 కిలోల బియ్యాన్ని సువర్ణరాజు సొంత నిధులు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గణపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గేరా ఫణేంద్ర, మల్లేశ్వరరావు, సాయి, రాజేష్, జాలిపర్తి సందీప్, పండు, సూర్య, వంశీ, ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జగణపయ్యా.. భుజించవయ్యా!



తాళ్లపూడి, సెప్టెంబరు 18 : తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలోని ఆటోనగర్‌లో బుధవారం గణపతికి 108 రకాల ప్రసాదాలు నివేదించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ వినాయకచవితి గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా దాతల సహకారంతో 108 రకాలతో పిండి వంటలు చేయించి నివేదించామని తెలిపారు. అనంతరం గణపతి నిమజ్జన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి



కషాయాల తయారీని వివరిస్తున్న అధికారులు

కొవ్వూరు, సెప్టెంబర్ 18 : ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం వల్లీ అన్నారు. బుధవారం కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కషాయాల తయారీని వివరించారు. అశాస్త్రం, కోడిగుడ్డు నిమ్మరసం, వేప కషాయం, ఇంగువ, పచ్చిపాలు, మీనామృతం కషాయాల తయారీ, తెగుళ్లు, పురుగుల నివారణకు తీసుకోవలసిన చర్యలు, అధిక దిగుబడికి, నాణ్యత భద్రతకోసం తీసుకోవలిసిన చర్యలను వివరించారు. అనంతరం తయారుచేసిన కషాయాలను డ్రోను సహాయంతో సామూహికంగా రైతుల పొలాల్లో పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎఫ్ఏ హరీష్, ఎన్ఈఏ ఎం.టి. మహారాణి, యూనిట్ ఇంచార్జి కె. రామకృష్ణ, ఐసీఆర్‌పిఎస్ రవిప్రకాష్, దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి



ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు

నిడదవోలు, (ఆంధ్రజ్యోతి) సెప్టెంబరు 18 : రైతులందరూ సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాలని, ఇందుకు వ్యవసాయ శాఖ ఉచితంగా ఎలు కల నివారణ మందు అందిస్తోందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. నిడద వోలు మండలం డి.ముప్పవరం గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంట చిరుపొట్ట దశలో ఉందని ఈ సమయంలో పొటాష్ వాడడం వల్ల వరిపంటకు తెగుళ్ల, పురుగులను తట్టుకునే శక్తి వస్తుందన్నారు. అనంతరం జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు రామలక్ష్మి మాట్లాడుతూ వరిపంటలో రైతులు విచక్షణారహితంగా పురుగుల మందులు వాడకూడదన్నారు. అనంతరం పంటకు అవసరమైన పోషక ద్రవ్యాన్ని తయారు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి జి.సత్యనారాయణ, రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వరసిద్ధి వినాయకుడి ఊరేగింపు

చాగల్లు, సెప్టెంబరు 18: గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా చాగల్లు, నెలటూరు వర్తకసంఘం వారి సంపత్ వరసిద్ధి వినాయకస్వామి వారి ఊరేగింపు వేడుకగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి వారిని ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. విచిత్ర వేషాలు, శక్తి వేషాలు, డప్పు వాయిద్యాలు, బ్యాండు మేళాలతో భారీ ఎత్తున బాణ సంచా పేలుస్తూ స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవకమిటీ అధ్యక్షుడు గ్రంధి రాంబాబు, సభ్యులు సుభాష్, పచ్చిపులుసు ప్రసాద్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సంపత్ వరసిద్ధి వినాయక స్వామి ఊరేగింపు

అంబేడ్కర్ చౌక్‌గా మార్చాలి



వినతిపత్రం అందిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నిడదవోలు, (ఆంధ్రజ్యోతి) సెప్టెంబరు 18 : నిడదవోలు పట్టణంలోని సంతమార్కెట్ కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఉన్న సర్కిల్‌ను అంబేడ్కర్ చౌక్‌గా పేరు పెట్టాలని కోరుతూ కేవీపీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణకు నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఛైర్మన్ సానుకూలంగా స్పందించారని జువ్వల రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, కేవీపీఎస్ నాయకులు వస్కా ప్రభాకర్, జీవపాటి శ్రీను, సురేష్ తదితర్లు పాల్గొన్నారు.

లడ్డూ పాటకు విశేష స్పందన



లడ్డూ దక్కించుకున్న మాజీ కౌన్సిలర్ శ్రీధర్

నిడదవోలు, (ఆంధ్రజ్యోతి) సెప్టెంబరు 18 : నిడదవోలు పట్టణంలోని యాదవుల వీధిలో వినాయక విగ్రహం వద్ద ఉంచిన అదృష్ట లడ్డుకు బుధవారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో మాజీ కౌన్సిలర్ సుంకవల్లి శ్రీధర్ పది వేల రూపాయిలకు పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, గంగుల గోపీయాదవ్, బీజేపి పట్టణ అధ్యక్షుడు నీలం రామారావు, బోగిరెడ్డి రామకృష్ణ తదితర్లు పాల్గొన్నారు.

నేడు బీసీ జనగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18: రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం మధ్యాహ్నం 3గంటలకు బీసీ జనగణనపై బీసీ అసెంబ్లీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన అంబేడ్కర్ భవన్‌వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ సమాశానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్ లు జె.పూర్ణచంద్రరావు, జి.చిత్రసేనలు హాజరవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో కులగణన నిర్వహించి బీసీలకు జనాభాను బట్టి పార్లమెంట్, అసెంబ్లీలో సీట్లు రిజర్వ్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో కులగణ నిర్వహించి స్థానిక సంస్థల్లోను, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని బీసీ సంఘాలు, బీసీ మేథావులు హాజరుకావాలని కోరారు.

'పడాల'కు పలువురి నివాళి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18: అరసంనేత కోస్తా సమయం సంపాదకుడు పడాల వీరభద్రరావు అంత్యక్రియలు బుధవారం రాజమహేంద్రవరంలో జరిగాయి. గోరక్షణపేటలోని ఆయన నివాసంలో పడాల వీరభద్రరావు పార్థీవ దేహానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, మండేల శ్రీరామ్మూర్తి, జమ్మా రాజారమేష్, నగర ప్రముఖులు డాక్టర్ కర్రి రామారెడ్డి, దేశిరెడ్డి బలరామనాయుడు, సీనియర్ పాత్రికేయులు రవికాంత్, నాని, కళాధర్, వి.రామకృష్ణ, ఎంటీవీ సారధి, శ్రీనివాస్ యాదవ్, దామోదర్ తదితరులు నివాళులు అర్పించారు. పడాల సేవలను గర్తుచేసుకున్నారు. పడాల కుటుంబానికి తమ ప్రగాడ సానుభూతిని తెలిపారు.

న్యాక్‌లో ట్రైనర్లకు శిక్షణ

ధవళేశ్వరం, సెప్టెంబరు 18: నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్‌లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ట్రైనర్లకు 12రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో టీవోటీలకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు న్యాక్ సంచాలకుడు జె.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు వివిధ జిల్లాల నుంచి 50 మంది ట్రైనర్లు హాజరయ్యారన్నారు. 12రోజులపాటు నిర్వహించే ఈ రెసిడెన్షియల్ శిక్షణకు మాస్టర్ ట్రైనర్లు సీహెచ్ గంగాదాస్, ఎ.కార్తికేశ్వరయ్య శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	సరిపోదా శనివారం
రాధాకృష్ణ	ది గోట్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్

గోపాలపురంలో స్వచ్ఛతా హి ర్యాలీ



గోపాలపురంలో స్వచ్ఛత హి సేవా ర్యాలీ

గోపాలపురం, సెప్టెంబరు 18: కాలుష్య రహిత దేశంగా తీర్చిదిద్దటమే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల సంకల్ప మని ఎంపీపీ ఉండవల్లి సత్యనారా యణ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గోపాలపురంలో ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఎంపీపీ ఉండవల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

జయజయ శుభకర వినాయక..

నిడదవోలు, సెప్టెంబరు 18 : స్థానిక గాంధీబొమ్మ సెంటరులో వేంచేసిన మహాగణపతి ఆలయంలో వినాయక చవితిని పురస్కరించుకుని సుమారు 50 మంది మహాగణపతి భక్తులు గణపతి మాల ధరించారు. మహా గణపతి ఉపాసకులు శ్రీకాకోళపు నాగ సూర్య సత్యనారాయణమూర్తి గురుస్వామి ఆధ్వర్యంలో 21 రోజుల దీక్షను పూర్తి చేసిన స్వాములు బుధవారం నిడదవోలు నుంచి చిత్తూరు జిల్లా కాణిపాకం మహాగణపతి దర్శనానికి తరలి వెళ్లారు. ఉదయం నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించి ఇరుముడి కార్యక్రమం పూర్తి చేసుకున్నారు. అనంతరం భారీ ఊరేగింపుతో మేళతాళాలతో కాణిపాకం తరలివెళ్లారు.



నిడదవోలు నుంచి కాణిపాకం బయలుదేరిన గణపతి మాలధారులు